
ఆంధ్రజ్యోతి
3

ప్రకాశం
సోమవారం 13 జనవరి 2025

దూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు చేరుతున్న జనం
బస్సులు, రైళ్లు కిటకిట
ఉత్సవాలతో పల్లెలకు కళ
పలుచోట్ల కోడి పందేలకు బరులు సిద్ధం
పేకాటకూ ఏర్పాట్లు
చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరికలు



ఆనందాల వేదిక సంక్రాంతి వేడుక

జిల్లా వ్యాప్తంగా పండుగ సంబరాలు
క్రీడలు, ముగ్గుల పోటీలతో జోష్



పండుగ అంటే ఒక భావోద్వేగం. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయతలను కళ్లకు కట్టే అసలైన సందర్భం. బంధువుల పలకరింపులతో మనసు పులకరించే తియ్యని తరుణం. స్నేహితులను కలిసి ఆటపాటలాడి... కష్ట, సుఖాలు పంచుకునే చక్కటి వేదిక. తోటివారితో ఎప్పుడో వచ్చిన చిన్నచిన్న పొరపొచ్చాలు తొలిగిపోయి అందరూ ఐక్యంగా జరుపుకునే కమ్మని వేడుక. మన తెలుగు పండుగల్లో అలాంటి వేదికే సంక్రాంతి. ఊరంతా కలిసి మూడ్రోజులపాటు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆటపాటలతో, పిండి వంటకాలతో సంబరాలు చేసుకుంటూ ప్రతి ఇంట్లో ఆనందాలు పంచుకునే సందర్భం రానే వచ్చింది.

ఒంగోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి జనం సొంతూళ్లకు చేరుకుంటున్నారు. ఈపాటికే సెలవులు ప్రకటించడంతో విద్యార్థులతో బస్సులు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి. మూడు రోజులపాటు సాగే ఈ పండుగను పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున జరుపుకుంటున్నారు. యువతీ, యువకులు పలు క్రీడలు, ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. అలా సంక్రాంతి పండుగ సందడితో సాగుతోంది. జిల్లా అంతటా ఇదే ఉత్సాహం కనిపిస్తోంది.



ఒంగోలు : బస్సులో సీటు కోసం ప్రయాణికుల పాట్లు


ఒంగోలులోని జక్రయ్య హాస్పిటల్‌సెంటర్‌లో..


ఉప్పుగుండూరులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

పది రోజుల ముందు నుంచే పండుగ

జిల్లాలో ఈనెల 4,5 తేదీల్లో పలు చోట్ల 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పది రోజుల ముందే సంక్రాంతి పండుగ వాతావరణం మొదలైంది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ముందస్తు సంబరాలు జరిగాయి. ఆటల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. ముగ్గులు వేసి సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు సందడి చేశారు.

వాడవాడలా ఆటలు, ముగ్గుల పోటీలు

పల్లె, పట్టణాల్లో నాలుగైదు రోజులుగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలు, ముగ్గుల పోటీలు, ఎడ్ల బండ లాగుడు పోటీలు జోరుగా సాగుతున్నాయి. యువత ఉత్సాహంగా పాల్గొంటోంది. ఈనెల 13 నుంచి 15 వరకు పల్లెల్లో ఈ పోటీలు ఎక్కువగా జరగనున్నాయి. ఈపాటికే అందుకు అనుగుణంగా గ్రామాల్లో ఏర్పాట్లు జరిగాయి.

పల్లెదారి పట్టిన పట్నం

పొరుగు ప్రాంతాల్లో ఉండే జిల్లా వాసులు సంక్రాంతికి భారీగా తరలివస్తున్నారు. పండుగకు పదిహేను రోజుల ముందే రాకపోకలకు రిజర్వేషన్లు చేసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై, విజయవాడ వంటి నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉండే వారంతా సొంతూళ్లకు చేరుకుంటున్నారు. ఏటా దాదాపు లక్ష కుటుంబాలకుపైగా జిల్లా వాసులు సొంత ప్రాంతాలకు వస్తుంటారు. ఈ పాటికే సగంమందికిపైగా పల్లెలకు చేరుకున్నారు. మూడ్రోజుల నుంచి ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. అమెరికా, ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసేవారు సైతం అనేక మంది పండుగకు వస్తున్నారు.

జూదాల కట్టడి

పండుగ సందర్భంగా పల్లెల్లో పేకాటలు, కోడి పందేలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా అలాంటి వాటి నిర్వహణకు పలుచోట్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈపాటికే కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్ హెచ్చరికలు కూడా జారీ చేశారు.


ఒంగోలులో భోగి మంటలు వేసి యువకుల కేరింతలు

భోగిమంటలు.. భోగభాగ్యాల సిరులు

సంక్రాంతికి స్వాగతద్వారం... నేడు భోగి
యువతీ యువకుల పండుగోత్సాహం
5


కనిగిరి మండలం చిన ఇర్లపాడులో మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

పశుపోషకులకు పండుగ

మూడ్రోజుల్లో 470 మినీ గోకులాలు ప్రారంభం
రెండున్నర నెలల్లోనే నిర్మాణాలు పూర్తి

ఒంగోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి సంక్రాంతికి ప్రత్యేక కానుక ఇచ్చింది. వారికి శాశ్వతంగా ఉపకరించే పశువుల షెడ్(మినీ గోకులాలు)లను వినియోగంలోకి తెచ్చింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధులతో చేపట్టిన మినీ గోకులాలకు 90శాతం సబ్సిడీ సమకూర్చి నిర్మాణాలు చేపట్టింది. గత ఏడాది అక్టోబరు ఆఖరుకు యూనిట్ల ఎంపిక, మంజూరు చేయగా రెండున్నర నెలల వ్యవధిలోనే ఇంచుమించు సగం గోకులాల నిర్మాణాలు పూర్తయ్యాయి. జిల్లాకు ప్రభుత్వం 1,075 యూనిట్లు కేటాయించింది. అధికార యంత్రాంగం 1,040 యూనిట్లను మంజూరు చేసింది. అందులో 470 మినీ గోకులాల నిర్మాణాలు ఇప్పటికే పూర్తికాగా వాటిని మూడు రోజులుగా ప్రారంభించారు. నెలాఖరుకు మొత్తం పూర్తి చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పండుగ వాతావరణంలో కార్యక్రమం

పర్యవేక్షణ చేసే జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ జోసఫ్ కుమార్ నేతృత్వంలో ప్రణాళికా బద్ధంగా కార్యక్రమం కొనసాగింది. తొలిరోజైన ఈనెల 9న మద్దిపాడులో స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కలెక్టర్ అన్సారియాతో కలిసి జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి మినీ గోకులాన్ని ప్రారంభించారు. దోర్నాలలో స్థానిక టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతో కలిసి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. చివరి రోజైన ఆదివారం చిన ఇర్లపాడులో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దరిమడుగులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సింగరాయకొండలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు.

బంధాలు తెగిపోతున్నాయ్!

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త
ఇంకోచోట ఇల్లాలిని చంపేందుకు తమ్ముళ్లతో కలిసి భర్త ప్రయత్నం... పోలీసుల విచారణలో తేలిన నిజం
అల్లుడిని చంపేందుకు మామ సుపారీ
కుమార్తెతో మతాంతర వివాహం నచ్చకపోవడమే కారణం
5


చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసు

ఒంగోలులో బ్యాలెట్ బాక్సుల అపహరణ

గోడౌన్ గోడకు కన్నం వేసి 8 బాక్సులు చోరీ
మరో విడత 12 తరలిస్తుండగా గుర్తించిన సిబ్బంది
అదుపులో ముగ్గురు నిందితులు
మెయిన్‌లో


ఒంగోలులో వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ అన్సారియా

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సూచించారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కొత్తపట్నం బస్టాండులోని ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి మంత్రి స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అందుకోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌షా, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


దోర్నాలలో వృద్ధురాలి మెడికల్ రిపోర్టును పరిశీలిస్తున్న డాక్టర్ అబ్దుల్‌కలాం (ఫైల్)

నకిలీ సర్టిఫికెట్లతో అడ్డగోలుగా ఆరోగ్య పింఛన్‌లు
విచారణలో బయటపడుతున్న వైనం
పశ్చిమప్రాంతంలో అధికం
విస్తుపోతున్న వైద్య బృందాలు

భారీగా బోగస్‌లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఆరోగ్య పింఛన్ల మంజూరు వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. అనేక మంది ఎలాంటి జబ్బులు లేకుండానే, మంచంలో ఉండకుండానే పింఛన్‌లు పొందుతున్నట్లు తేలుతోంది. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన వైద్య బృందాలు విషయం తెలుసుకొని విస్తుపోతున్నాయి. కొందరు నకిలీ సర్టిఫికెట్లపై పింఛన్లు పొందుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విచారణకు ఆదేశించింది. ఐదు ప్రత్యేక వైద్య బృందాలను నియమించింది. అవి ఈనెల 6వతేదీ నుంచి మండలాల వారీగా పరిశీలన చేపట్టాయి. జిల్లావ్యాప్తంగా 2,436 మంది వివిధ రకాల వ్యాధుల పేరుతో సర్టిఫికెట్లు తెచ్చుకొని నెలకు రూ.10వేలు పింఛన్ పొందుతున్నారు. వీరితోపాటు 1,236 మంది మంచం, వీల్‌చైర్‌కు పరిమితమైనట్లు సర్టిఫికెట్లు చూపి నెలకు రూ.15వేలు తీసుకుంటున్నారు. వారి నివాసాలకు వైద్య బృందాల వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నాయి. ఈ సమయంలో విచారణాధికారులు లబ్ధిదారుల నుంచి పలు అంశాలను రాబడుతున్నట్లు తెలిసింది. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి పంపుతున్నారు. అయితే కొందరు రకరకాల అబద్ధాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. పలువురు పింఛన్లు పొందేందుకు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల్లో కూడా కొన్ని మార్పులు చేసినట్లు స్పష్టంగా గుర్తించినట్లు తెలిసింది. పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

40 శాతం ఫేక్

జిల్లావ్యాప్తంగా ఇప్పటికే లబ్ధిదారుల్లో 50శాతం మేర సర్టిఫికెట్ల పరిశీలన ముగిసినట్లు సమాచారం. ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించిన వాటిలో సుమారు 40శాతం మేర ఫేక్ అని వైద్య బృందాలు గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం రోగుల ఇంటి వద్దకే వైద్య బృందాలు వెళ్లి పరిశీలన చేస్తుండటంతో స్థానికంగా ఆ గ్రామంలో ఉండే ప్రజాప్రతినిధుల నుంచి కూడా ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వమార్గదర్శకాల ప్రకారం తాము లబ్ధిదారుడి స్థితిగతులను పరిశీలించేందుకు వచ్చాం తప్ప పింఛన్లు తొలగించేందుకు రాలేదని చెప్పి వైద్య బృందాలు తమ పనితాము చేసుకుపోతున్నాయి. కొంతమంది లబ్ధిదారులు తమకు సర్టిఫికెట్లతోపాటు పింఛన్ల మంజూరు ఎవరు చేయించారో కూడా చెప్తున్నట్లు సమాచారం. అధికారులు సైతం కొంత మొత్తాలు తీసుకొని తమకు మంజూరు చేశారని విస్తుపోయే నిజాలను వైద్య బృందాలకు లబ్ధిదారులు చెప్తున్నట్లు సమాచారం. దీంతో తప్పుడు సర్టిఫికెట్లతో పింఛన్లు మంజూరు చేసిన ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. ఇప్పుడు జరుగుతున్న విచారణలో తమ పేర్లు చెబితే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా ఆరోగ్య పింఛన్లలో భారీగా బోగస్‌లు బయట పడుతుండటంతో అటు లబ్ధిదారుల్లోనూ, ఇటు సర్టిఫికెట్లు మార్ఫింగ్ చేసి పింఛన్లు మంజూరుకు దోహదపడిన ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంది.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీపికబురు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి తీపి కబురు అందించారు. బకాయిల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గత ఏడాది ఆగస్టు నుంచి జీపీఎఫ్‌తో పాటు గ్రాట్యుటీ నిలిచిపోయాయి. పెండింగ్ జీపీఎఫ్ రూ.519 కోట్లు విడుదలైంది. జిల్లాకు రూ.25 కోట్లు రానున్నాయి. అత్యవసరాలకు దాచుకున్న డబ్బుల కోసం ఇప్పటికే వందలాది మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు వారందరికీ చెల్లింపులు జరగనున్నాయి. దీంతోపాటు వివిధ రకాల గ్రాట్యుటీ కూడా విడుదలైంది.

పీవీఆర్ మైదానాన్ని క్రీడలకే వినియోగించాలి

- యువజన క్రీడా సమాఖ్య డిమాండ్
- ఎన్టీఆర్ కళాపరిషత్ ఏర్పాట్లు నిలిపివేత

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీవీఆర్ స్కూలు క్రీడామైదానంపై మరోసారి వివాదం చోటు చేసుకుంది. ఈ మేరకు ఆదివారం ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాల సందర్భంగా చేపట్టిన పనులను యువజన క్రీడా సమాఖ్య అడ్డుకుంది. వివరాల్లోకెళితే.. ఈనెల 18వ తేదీ నుంచి స్థానిక పీవీఆర్ క్రీడా మైదానంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలను నిర్వహించనుండగా అందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. అయితే పీవీఆర్ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు, యువజన క్రీడా సమాఖ్య ప్రతినిధులు దీనిపై అభ్యంతరం తెలిపారు. క్రీడా మైదానాన్ని ఎలాంటి వ్యాపార సంబంధమైన వాటికి కేటాయించకూడదని వెల్లడించారు. నాటిక పోటీలకు కార్పొరేషన్ కమిషనర్ అనుమతి ఉందని పరిషత్ ప్రతినిధులు తెలియజేయగా, అదే విషయాన్ని సమాఖ్య సభ్యులు కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. ఆ లెటర్ తాను ఇవ్వలేదని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాదన జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ మైదానంలో వివిధ వ్యాపారాలకు కేటాయించడాన్ని తప్పు పడుతూ 2017లో 314 నెంబరుతో పిల్ వేసినట్లు తెలిపారు. దీంతో అప్పటి నుంచి గ్రౌండ్ విషయమై కోర్టులో నడుస్తుందని చెప్పారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు వివిధ రాజకీయ కార్యక్రమాలకు, దీపావళి వేడుకలకు కేటాయించడంతో తాజాగా మరోసారి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు జరిపేందుకు వచ్చారని, దీనిని తాము అంగీకరించడం లేదని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల పీవీఆర్ గ్రౌండ్ ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు కేటాయించవద్దని చెప్పారు. దీంతో ఎన్టీఆర్ కళా పరిషత్ నాటకోత్సవాల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. దీనిపై కమిషనర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా, కోర్టులో పిల్ ఉందని తెలిసిందని, దీనిపై పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు పనులు నిలిపివేయాలని తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఆగిన నాటకోత్సవాల ఏర్పాట్లు

ఉద్యోగుల మేలే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి స్వామి

టంగుటూరు జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు మేలు ఒనగూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నదన్నారు. పోలీస్ ఉద్యోగులకు జీపీఎఫ్, సీపీఎస్, సరెండర్ లీవు బకాయిలు చెల్లించినందుకు గాను ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పలువురు పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని వారు సత్కరించారు.

తెలుగునాడు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక మంత్రి స్వగ్రామంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ.రవి ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జి.సులోచన, సభ్యులు ఎ.వెంకటేశ్వర్లు, ఎంసీహెచ్.వెంకయ్య, పి.ప్రభాకర్, వి.రవి, రామకృష్ణ, డి.శ్రీనివాసమూర్తి, కె.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నమాచార్య సంకీర్తనల విభావరి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దామచర్ల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలులో మినీ స్టేడియంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయిని కొండవీటి జ్యోతిర్మయి, ఆమె బృందంతో సోమవారం అన్నమయ్య సంకీర్తనల విభావరిని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే దామచర్ల పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం అయ్యే ఈ ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

వివాహిత ఆత్మహత్య

సంతనూతలపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎరుకల మందు తిని వివాహిత మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కానిస్టేబుల్ ఎం.శ్రీను తెలిపిన సమాచారం మేరకు, మండలంలోని గొర్లమిట్ట గ్రామానికి చెందిన గడ్డం రామకోటమ్మకు ఫిలిప్ అనే వ్యక్తితో 22 ఏళ్లక్రితం వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు పిల్లలు. గత కొంతకాలంగా గొర్లమిట్టలోనే దంపతులు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. ఈనెల 7వతేదీన ఇంటికి వచ్చిన ఫిలిప్ తన భార్యతో గొడవపడగా మనస్థాపం చెందిన కోటమ్మ ఇంట్లోని ఎలుకలమందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే ఆమె తల్లిదండ్రులు ఒంగోలు రిమ్స్‌కు తరలించగా ఈనెల 11న చికిత్స పొందుతూ మరణించారని, శనివారం రాత్రి 11-30 గంటలసమయంలో కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

వైభవంగా సుదర్శన లక్ష్మీనారసింహ యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

ఒంగోలు (కల్చరల్), జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గడియారంవారి వీధిలోని సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీ అనంత కోదండరామ స్వామి దేవస్థానం వద్ద శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ యజ్ఞం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థాన ఆగమ సలహాదారు కళ్యాణపురం రాజేష్‌కుమార్‌భట్టర్ బృందం యాజ్ఞికంలో క్రతువులను నిర్వహించారు. ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గూడా రామ్మోహనరావు తదితరులు యజ్ఞకర్తలుగా వ్యవహరించగా నగర కమిషనర్ వెంకటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బ్రాహ్మణ సేవా సమితి ప్రముఖులు మహంకాళి వెంకటశేషయ్య, మైనంపాటి సాయికుమార్, కార్పొరేటర్ గిరిజాశాండిల్య పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం నగరంలో పలు సంస్థల ఆధ్వర్యంలో పలు పోటీలు జరిగాయి. స్థానిక గద్దలగుంటపాలెంలో గద్దలగుంట అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులపోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని సౌమ్య, ద్వితీయ బహుమతిని లీలావతి, తృతీయ బహుమతిని సుబ్బలక్ష్మి గెలుపొందారు. న్యాయ నిర్ణేతలుగా పి.కృష్ణకుమారి, డి.శాంతికుమారి పాల్గొనగా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు, న్యాయవాది చిట్ట వెంకటేశ్వర్లు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసులు పర్యవేక్షించారు.

- విశ్వ వికాస భారతి సేవాసంస్థ ఆధ్వర్యంలో శర్మ కళాశాల మైదానం వద్ద ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు పోటీలను నిర్వహించగా విజేతలకు మేయర్ గంగాడ సుజాత చేతులమీదుగా నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

బృందావన గార్డెన్స్ కాలనీలో..




ముగ్గులు వేస్తున్న మహిళలు

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావన గార్డెన్స్ కాలనీలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. దివి బ్రహ్మానందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీసీ శ్రీనివాసరావు, పోస్టల్ మోహనరావు, పిన్నక శ్రీనివాసరావు, నీలం రంగలక్ష్మి, సుభాషిణి, లక్ష్మీనారాయణమ్మ, ఉప్పుటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: సంక్రాంతి సందర్భంగా వాసవీక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉప్పుగుండూరులో నాలుగు మండలాల స్థాయి ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ ఈ పోటీలను ప్రారంభించారు. చినగంజాంకు చెందిన మచ్చా మాదవి మొదటి బహుమతి దివాన్ కాట్, రెండో బహుమతి ఇ.కోటేశ్వరమ్మ సిల్వర్, మూడవ బహుమతి కడవకుదురుకు చెందిన జి.విజయశాంతి వెట్‌గ్రైండర్, నాల్గవ బహుమతి మోట సుమతి గ్రైండర్, ఐదవ బహుమతి మాలెంపాటి శరణ్రప్రియకు మిక్సీని, పాల్గొన్న మహిళలందరికి కన్సోలేషన్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు, గవర్నర్ చుండూరు గాయత్రి, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, మాదాసు రాంబాబు, అమరా వేణు, పులకంణం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..



బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

సంతనూతలపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంతనూతలపాడు లోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఒంగోలు లక్ష్మీ షాపింగ్‌మాల్, వాసవీక్లబ్, మహిళక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముగ్గులపోటీలు ఉత్సాహంగా సాగాయి ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను టీడీపీ నేత తన్నీరు శ్రీను, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వి.శేషారావు, మహిళా అధ్యక్షులు చంద్రావతి, వీఎన్.ప్రసాదరావు, జీవిఎల్.ప్రసాదరావుల చేతులమీదుగా అంద జేశారు. న్యాయనిర్ణేతలుగా జేవీవీ నాయకుడు కోడాటి కోటేశ్వరరావు, రిటైర్డ్ హెచ్ఎం శ్రీనివాస్ వ్యవహరించారు.

చీమకుర్తిలో..



బహుమతిని అందజేస్తున్న రఘుబాబు

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఎంఎస్ఆర్, ధరణి అపార్ట్‌మెంట్ ఆవరణలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కొండ్రు ప్రియాంక ప్రథమ, ద్వితీయ బహుమతిని గోలి గోవర్ధిని, మూడవ బహుమతిని ఆఫ్రిమున్నీసా కైవసం చేసుకున్నారు. వారికి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, శిద్దా సురేష్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కందుకూరి వెంకటసుధాకర్, గొల్లపూడి వెంకట్రావు, రామబ్రహ్మం, శ్రీనివాసమూర్తి, వీరారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

- మారిటైం బోర్డు చైర్మన్ సత్య



గోకులం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ దామచర్ల సత్య

సింగరాయకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్పనగర్‌లో ఆదివారం మినీ గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ మండలానికి 48 మినీ గోకులాలు మంజూరైతే ఇప్పటికే 23 మంది నిర్మాణాలు పూర్తిచేశారని, మరో 25 వివిధ దశల్లో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, గాలి హరిబాబు, బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, వేల్పుల వెంకట్రావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వల్లాయపాలెంలో..

మర్రిపూడి: వల్లాయపాలెం గ్రామంలో నిర్మించిన గోకులంషెడ్‌ను తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో జగదీష్, పశువైద్యాధికారి కృష్ణమోహన్, ఏపీవో రాంబాబు, టీడీపీ నాయకులు కొండా కోటిరెడ్డి, సన్నపురెడ్డి నరసింహారెడ్డి, పోకల తిరుపతిరెడ్డి, మద్దూరి దాసు, నరసయ్య, పుల్లయ్య, నలగట్ల సుబ్బయ్య, పెదమీరయ్య, పోలిచర్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు మండలంలో..

టంగుటూరు : మండలంలోని వల్లూరు, ఆలకూరపాడు, మల్లవరప్పాడు, కాకుటూరివారిపాలెం , తూర్పునాయుడుపాలెం, టంగుటూరులలో నిర్మించిన గోకులం షెడ్లను స్థానిక టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లం జయంత్‌బాబు, నార్నె మోహనరావు, బొజ్జా శ్రీనివాసరావు, సర్పంచ్ కొమ్మినేని రవణమ్మ, ఏవో బ్రహ్మయ్య, ఏపీవో సుభాషిణి, ఈసీ. టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రుద్రవరంలో..

సంతనూతలపాడు : రుద్రవరం గ్రామంలో ఆదివారం గోకులంషెడ్‌ను గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కూకట్ల శరత్ ప్రారంభించారు.

నిబద్ధత, పట్టుదలతో విజయం తథ్యం

- శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్



సభలో మాట్లాడుతున్న రవికుమార్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, పట్టుదలతో విజయం సాధించడం తథ్యమని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ పేర్కొన్నారు. ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణి విద్యాసంస్థలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా తమ విద్యా సంస్థల ప్రారంభం నుంచి చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తమ విద్యాసంస్థల ప్రారంభం ముగ్గురితో ప్రారంభమైన నిరుత్సాహపడకుండా పట్టుదలతో అంచలంచెలుగా కళాశాలను అభివృద్ధి చేసుకుంటూ వేల సంఖ్యలో విద్యార్థులకు ప్రస్తుతం విద్యను అందిస్తున్నామన్నారు. ఉన్నత విద్యను కూడా పేదలకు అందుబాటులో ఉండేలా సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. రానున్న విద్యా సంవత్సరంలో మహిళా ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రాజు మాస్టర్ మాట్లాడుతూ గత 30 ఏళ్ళుగా రవికుమార్ అంచలంచెలుగా అనేక విద్యా సంస్థలు ఏర్పాటు చేసి అన్ని వర్గాలకు మేలు చేకూర్చారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, జీఎం శివరాం, కళాశాల డీన్ దాడి అంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్ రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసరస్వతి విద్యాసంస్థల వార్షికోత్సవం

- హాజరైన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల



ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, కమిషనర్ వెంకటేశ్వరరావు, రాఘవరెడ్డి, మేయర్ సుజాతలను సత్కరిస్తున్న చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు విద్య, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతి విద్యాసంస్థల 34వ వార్షికోత్సవం జల్సా-3 పేరుతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి కళాశాలను వేడుకల్లో భాగంగా తెలుగుదనం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రావీణ్యం అవసరమన్నారు. శ్రీసరస్వతి విద్యాసంస్థలు మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అభిలాషించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు చూడలేదన్నారు. శ్రీసరస్వతి విద్యాసంస్థలు జూనియర్ కళాశాలలో ఆగకుండా డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలను కూడా ఒంగోలులో ఏర్పాటు చేయాలని కోరారు. ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, టీడీపీ యువనేత మాగుంట రాఘవరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి, డైరెక్టర్లు ఎ.గంగాశంకర్‌రెడ్డి, ఎ.గణేష్‌రెడ్డి, సీఈవో ఎన్.సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ఏడుగురికి స్వల్పగాయాలు



నుజ్జునుజ్జయిన బస్సు ముందుభాగం

సింగరాయకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జీవీఆర్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ఫ్లైవోవర్‌పై ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన కావేరి ట్రావెల్స్ బస్సు జీవీఆర్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ఫ్లైవోవర్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు క్యాబిన్ భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో 20 మంది ప్రయాణిస్తుండగా వారిలో ఏడుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. మిగతా వారు సురక్షితంగా బయటపడటంతో ఊపరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై బి. మహేంద్ర, హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డు ప్రమాదంపై ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని ఆదివారం పలు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు.

- లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక శర్మ కళాశాలలోని వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర వెంకటేష్, ఫౌండర్ కూరపాటి రమేష్, కార్యదర్శి గ్రంధే పార్థసారధి, కోశాధికారి లక్ష్మణస్వామి, పల్లపు సుబ్బయ్య, తమ్మన ఆంజనేయులు, అబ్బిశెట్టి జనార్దన, పోకూరి నవీన్ పాల్గొన్నారు.

- స్థానిక హైదరీక్లబ్‌లో జేసీఐ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. అధ్యక్షుడు ఎంవీ.సుబ్బారావు, చైర్మన్ వెన్నపూస శ్రీరాములురెడ్డి, విష్ణువర్ధన్, వీవీ.రమణ, నైనాల రామకృష్ణ, ఆత్మకూరు బ్రహ్మయ్య, కనకారావు, పిడుగు జాలిరెడ్డి, ఎస్వీఎస్ ఏడుకొండలు, ఎం.శ్రీధర్, సోమినేని సురేష్, రాజేష్, డాక్టర్ రవికుమార్, మాల్యాద్రి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

- జిల్లా గ్రంధాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. బొమ్మల కోటేశ్వరి, సంపూర్ణమ్మ, డి.సందీప్, ఎస్.అనిల్‌బాబు ఘనంగా నివాళులర్పించారు.

- వాసవీక్లబ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు భూమా శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక శర్మ కళాశాలలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ కార్యదర్శి మద్దాలి శివప్రసాద్, కోశాధికారి సంపత్, పబ్బిశెట్టి గోవర్ధన్, నల్లమల్లి బదరీనారాయణ, రాధారమణ గుప్తా, జంధ్యం తదితరులు పాల్గొన్నారు.

- ఒంగోలు కలెక్టరేట్ : బీజేపీ యువమోర్చా నాయకుడు సింగోతు రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపట్నం బస్టాండులోని వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగండ్ల శ్రీనివాసులు, యోగయ్యయాదవ్, తొగంటి శ్రీనివాసులు, కాటా రాధాకృష్ణ, సుధాక, నాయకులు పాల్గొన్నారు. స్థానిక భాగ్యనగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శెగ్గెం శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యు.అఖిల, యు.గిరిష, ఎం.కీర్తన, తేజేశ్వన్, వరలక్ష్మి, పద్మనాభుని పేరిశెట్టి, పి.పూర్ణకుమారి పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఉప్పుగుండూరు గ్రామంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు పాల్గొన్నారు.

భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. భోగిమంటలతో, ముగ్గులతో, ఆటపాటలతో సంక్రాంతి పండుగను మూడు రోజులు ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఒంగోలు కార్పొరేషన్: సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం నింపాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆకాంక్షించారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు, టీడీపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

కొండపి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): పెదకండ్లగుంట గ్రామంలో క్యూరింగ్‌లో ఉన్న పొగాకు బ్యారన్ ఆదివారం ఉదయం దగ్ధం అయ్యింది. గ్రామానికి చెందిన దూదిపల్లి కోటయ్య పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ జరుగుతుండగా కర్ర జారి పడి మంటలు అంటుకొని కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఆస్తినష్టం అంచనా వేస్తున్నారు.

48 మద్యం బాటిళ్లు పట్టివేత

మద్దిపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దొడ్డవరం గ్రామంలో మద్యం అక్రమం అమ్ముతున్న ఓ మహిళను ఆదివారం ఎస్ఐ శివరామయ్య అదుపులోకి తీసుకున్నారు. మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి 48 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీవాలకు టీకాలు

ఒంగోలు(రూరల్), జనవరి12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఆదివారం గొర్రెలకు బొబ్బవ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కాట్రగడ్డ లక్ష్మయ్య మాట్లాడుతూ మండలంలో గొర్రెలకు బొబ్బవ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నాయని చెప్పారు. గ్రామంలో 400 గొర్రెలకు టీకాలు వేశారు. కాపరులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు విద్య, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక కొత్తపట్నం బస్టాండులో జరిగిన సభలో రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెమొంటోలను క్విజ్ విద్యార్థులు అందుకున్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన క్విజ్‌పోటీల్లో విద్యార్థులు బహుమతులు సాధించారు. కథారచన, కవిత్వం, సైన్స్ అండ్ టెక్నాలజీ, హ్యాండీ క్రాఫ్ట్ విభాగాల్లో అవినాష్, శ్రీనిధి, మేఘన, సూర్య ప్రకాష్, హర్షిత, లలితాంబికలు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణచక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీగాయత్రి అభినందించారు.

కాపు సంఘం అడ్‌హాక్ కమిటీ



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాపుసంఘం అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కాపు సంఘం కార్యాలయంలో కాపు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నారపుశెట్టి రామ్మోహన్‌రావు, ప్రముఖ న్యాయవాది అయినాబత్తిన గోపీకృష్ణ, ఆడిటర్ దరిమడుగు నాగరాజు పర్యవేక్షణలో అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొక్కిరాల సంజీవకుమార్, ఉపాధ్యక్షులుగా కమ్మెల ఆంజనేయులు, నరహరి సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా తంజావూరు శ్రీనివాసమూర్తి, కోశాధికారిగా నంద్యాల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పూల శ్రీను, చెన్నంశెట్టి శివ, లింగంశెట్టి సుబ్బారావు, మిరియాల వెంకటేశ్వర్లు, మేకల నారాయణ;శెట్టి పాపారావు, అడుసుమల్లి వీరబ్రహ్మంతో పాటు మరో 27 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నేటి నుంచి ఉలిచిలో సంక్రాంతి వేడుకలు

ఒంగోలు(రూరల్), జనవరి12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో సోమవారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఉలిచి అభ్యుదయ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం ఉలిచిలో వారు మాట్లాడుతూ ఈ వేడుకలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, హైదరాబాద్‌లోని సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బాలలత, సినీ హీరో గోపీచంద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో నిర్వాహకులు గార్లపాటి రామారావు, బోయిడి ఆంజనేయులు, చుంచు నాగేశ్వరరావు, చప్పిడి రవీంద్రబాబు, బొద్దులూరి రామారావు, బొద్దులూరి హనుమంతరావు, చేజర్ల వెంకట్రావు, చుంచు రామకృష్ణ, ఇనగాల చక్రపాణి, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొండపి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ముప్పవరం జడ్పీస్కూల్‌లో 1974-75, 1975-76, 1976-77 సంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశం అయ్యారు. వయసు మీద పడినా ఉత్సాహంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు హరిముకుందారెడ్డి, జి. శ్రీనివాసరావు, నరసింహారావు, సీహెచ్.సుబ్బారావులను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు మద్దినేని వెంకయ్య, ప్రవచనకర్త కప్పగంతుల జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అసమానతలు తొలగినప్పుడే సమసమాజం సాధ్యమవుతుందని వెంకటరమణ నర్సింగ్ హోం డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం కేవీపీఎస్ క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కాకి కృపారావు, ట్రాన్స్‌కో డీఈ డి.సుధీర్‌బాబు, జాలా అంజయ్య, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, కొప్పోలు సుబ్బారావు, అడ్డగబొట్టు సుధాకర్, రాజు, బి.రఘురాం, అట్లూరి రాఘవులు, మోజేష్, టి.రామారావు పాల్గొన్నారు.

- ఒంగోలు నగర అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను చందలూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టంగుటూరి రాము, చీమకుర్తి కోటేశ్వరరావు, డాక్టర్ కృష్ణయ్య, చిట్యాల కొండయ్య, కళ్ళగుట శ్రీను, సాంబయ్య, శోభన్‌బాబు, ప్రసాద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

భోగిమంటలు.. భోగభాగ్యాల సిరులు



ప్రతి ఇంట్లో సందడేసందడి

భోగిపండుగ నాటి నుంచి ప్రతి ఇల్లూ సంక్రాంతి శోభను సంతరించుకుంటుంది. మహిళలు పండుగ పిండివంటల తయారీలో తలమునకలవుతుంటారు. ఇక చిన్నారుల, యువతీ యువకుల ఆటలకైతే అంతే ఉండదు. ఎన్నోరకాల ఆటలు మనకు ఈ సందర్భంగా ప్రతి పల్లెలోనూ కనిపిస్తాయి. ఒకవైపు మనిషి శరీరానికి హాని కలిగించే విపరీతమైన మంచు, చలిగాలులతో కోరలు చాచిన హేమంత రుతువు ముగిసి చెట్ల ఆకులు చిగురించే శశిర రుతువు ప్రారంభమయ్యే సమయం దగ్గరవుతుంది. దీంతో ఈ మూడురోజులు పల్లెపల్లెనా ఆహ్లాదకర వాతావరణం ప్రతి ఒక్కరినీ ఆనందంలో ముంచెత్తుతుంది.



భోగి మంట ముందు గంగిరెద్దుల వారు ప్రదర్శన(ఫైల్)

- సంక్రాంతికి స్వాగతద్వారం భోగి
- వివిధ ఆటలతో యువతీయువకుల ఉత్సాహం
- నేడు భోగి పండుగ

నలుగుతో స్నానం చేయాలి ఇలా...

భోగిమంటలు పూర్తికావటంతోనే 'నలుగుతో స్నానం' చేయాలి. నువ్వుల నూనె ఒంటికి రాసుకుని, దానిపై తడిపిన సున్నిపిండిని మర్దన చేసి ఆ తర్వాత కుంకుడుకాయ రసంతో తలస్నానం చేయటం నలుగుస్నానం. ఈ నలుగు స్నానం వల్ల చలికాలంలో మన శరీరంలో చేరిన కఫదోషాలు తొలగిపోతాయి. శరీరం నూతన కాంతిని, ఉత్తేజాన్ని పొందుతుంది.

● భోగిమంటలు

చలికాలంలో అత్యంత చలిగా ఉండే రోజు భోగి పండుగ రోజు. ఆ రోజున ప్రతి ఇంటిముందు భోగిమంటలు వేసి చలికాచుకోవటం ఆనవాయితీ. 'భగ' అనేపదం నుంచి భోగి అనే మాట వచ్చినట్లు చెబుతారు. భగ అంటే వేడి లేదా మంట. ఇక ఏడాదిలో ఉండే ఉత్తరాయణం, దక్షిణాయనాల్లో భోగిపండుగ దక్షిణాయనానికి ఆఖరు రోజు. అంటే భోగి మరుసటిరోజు నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. దక్షిణాయణంలో ఎదుర్కొన్న కష్టాలు, బాధలను భోగిమంటల రూపంలో అగ్నిదేవుడికి సమర్పించి ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ప్రసాదించాలని ప్రార్థించటం కూడా భోగిమంటల్లోని అంతరార్థం. తెల్లవారుజామునే ఆవుపేడ పిడకలు, తాటాకులు, కోసిన పంటల తాలూకు అవశేషాలు మొదలైన వాటిని రాజేసి ఇంట్లోని పాతవస్తువులను ఈ మంటల్లో వేస్తారు. పనికిరాని చెడు పాత ఆలోచనలను తగులబెట్టి కొత్తగా కాలంతోబాటు వచ్చే మంచి మార్పులను ఆహ్వానించటానికి కూడా ఈ భోగిమంట సంకేతం.

ఒంగోలు కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : 'సంక్రాంతి' తెలుగు లోగిళ్లలో ఆనందకాంతులను వెదజల్లే అతిపెద్ద పండుగ. ముఖ్యంగా ప్రతి పల్లె పులకించిపోయే సంప్రదాయ వేదిక అనడంలో అతిశయోక్తి లేదు. చల్లని గాలులు, పచ్చని పైర్లు, ధాన్యపు రాశులు వీటన్నిటి నడుమ అందంగా నృత్యం చేసే డూడూబసవన్నలు, హరిలోరంగ హరి అంటూ హరిదాసుల గజ్జల చప్పుళ్లు, జంగం దేవరలు, పగటివేషగాళ్లు, ఇంట్లోకి స్వాగతం పలుకుతూ ముంగిట్లో తీర్చిదిద్దిన రంగవల్లులు, వాటిలోని గొబ్బెమ్మలు, మా పౌరుషాన్ని చూడాలన్నట్లు రంకెవేసే ఎద్దులు... ఇలా చెప్పుకుంటూపోతే సంక్రాంతి పండుగకు ఉన్నన్ని ప్రత్యేకతలు మరే పండుగకు లేవు. అటువంటి సంక్రాంతి లక్ష్మికి స్వాగతద్వారం వంటిది 'భోగిపండుగ.

బొమ్మల కొలువు

భోగిపండుగ అంటే ప్రతి ఇంట సందడి చేసేది 'బొమ్మలకొలువు'. మహిళలు భోగినాటి సాయంత్రం వివిధరకాల బొమ్మలతో ఈ బొమ్మలకొలువును ఏర్పాటుచేయటం, చుట్టుపక్కల వారిని పిలిచి పేరంటం చేయటం, పిల్లలకు భోగిపళ్లు పోయటం మొదలైన వాటితో ప్రతి ఇల్లూ సందడిగా మారుతుంది. ఈ బొమ్మలకొలువులో దేవతామూర్తుల బొమ్మలు, కొండపల్లి, ఏటికొప్పాక మొదలైన చోట్ల తయారైన చెక్కబొమ్మలను ఉంచుతారు. మధ్యలో ఒక కలశాన్ని ఉంచి దానిని శ్రీమహాలక్ష్మిగా భావించి పూజిస్తారు.

● పులగం తయారీ...

సంక్రాంతి పండుగనాటికి ప్రతి పల్లెలో ధాన్యం ఇళ్లకు చేరుతుంది. భోగిపండుగ నాడు కొత్తబియ్యంతో వండిన 'పులగం' తినటం సంప్రదాయంగా వస్తుంది. కొత్తబియ్యం, పెసరపప్పు, మిరియాలు కలిపి చేసే పులగం రుచికరంగానే కాకుండా ఎంతో పోషకవిలువలు కలిగి ఉంటుంది. జీర్ణశక్తి మందగించే ఈ కాలంలో పులగాన్ని భోగి నాడు తప్పకుండా తినాలని ఇది జీర్ణశక్తిని ప్రేరేపిస్తుందని పెద్దలు చెబుతారు.



చిన్నారులు వేస్తున్న డ్యాన్స్

నగరంలో అర్ధరాత్రి యువకుల హల్‌చల్

- రెండు గ్రూపుల మధ్య ఘర్షణ
- ఇరువురికి గాయాలు

ఒంగోలు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో శనివారం అర్ధరాత్రి యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. పెళ్ళూరులో ఓ కళాశాల వార్షిక వేడుకలు జరుగుతుండగా ఇందిరమ్మ కాలనీకి చెందిన యువకులు కొంతమంది అక్కడ హడావిడి చేయడంతో కళాశాలకు చెందిన కొందరు యువకులు వారిని అడ్డుకున్నారు. పెళ్ళూరుకు చెందిన మరి కొంతమంది యువకులు అక్కడే ఉన్న పాఠశాల వద్ద ఉండగా, ఇందిరమ్మ కాలనీకి చెందిన యువకులు వారితో గొడవపడి ఓ స్కూటీని ధ్వంసం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన పెళ్లూరుకు చెందిన అయ్యప్పపై డేవిడ్ అలియాస్ బిల్లా దాడి చేసి గాయపరిచాడు. ఈ వ్యవహారం అంతా అర్ధరాత్రి 12.30 గంటలకు జరిగింది. అయప్ప ఆసుపత్రితో చేరాడు. అప్పటికీ వారి మధ్య చెలరేగిన ఘర్షణ ఆగలేదు. ఆదివారం తెల్లవారుజామున 4.30లకు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే కే భిక్షాలు, మరికొంత మంది ఉండగా అక్కడకు పెళ్లూరు యువకులు, కళాశాల పూర్వ విద్యార్థులు కలిసి వచ్చి దాడి చేశారు. దీంతో భిక్షాలుకు గాయాలయ్యాయి. రాత్రుళ్ల ఇలాంటి ఉదంతాలు జరిగినా పోలీసులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్మీనరసింహ సన్నిధిలో ఉగ్ర

మర్రిపూడి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పృథులగిరి లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. తమ ఇంటి ఇలవేల్పు అయిన లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో శాసనసభ్యులుగా రెండవసారి గెలుపొందగలిగానని ఆయన చెప్పారు. తొలుత స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు నారాయణం తిరుమలాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట టీడీపీ కనిగిరి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, నాయకులు ఇందిరా ప్రసూన, పార్వతీ, నారాయణమ్మ, దొరసాని, లక్ష్మి పాల్గొన్నారు.



పృథులగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

బంధాలు తెగిపోతున్నాయ్!

మానవ సంబంధాలు మంటగలిసిపోతున్నాయి. భార్యాభర్తల బంధంపై అనుమానం కత్తి దూస్తోంది. వివాహేతర సంబంధాలు హత్యలకు పురిగొల్పుతున్నాయి. ఆధునిక యుగంలోనూ కుల, మతాంతర వివాహాలను జీర్ణించుకోలేక కొందరు ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడడం లేదు. ఆదివారం జిల్లాలో వెలుగు చూసిన పలు ఉదంతాలు ఇందుకు దర్పణం పడుతున్నాయి. కంభంలో అనుమానంతో భార్యను తలపై కర్రతో కొట్టి హతమార్చాడో భర్త. అలాగే వివాహేతర సంబంధం పెట్టుకున్నదన్న అనుమానం ఒకవైపు, ఆస్తి విషయంలో అడ్డుపడుతున్నదన్న కోపం మరోవైపు.. కట్టుకున్న భార్యను తన సోదరుల సాయంతో లారీతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించాడు మరో భర్త. ఈ ప్రమాదంలో ఆమె తప్పించుకోగా వరుసకు మనుమరాలు అయ్యే బాలిక మృతి చెందింది. నిందితుల్లో ఇద్దరిని మార్కాపురం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇక కుమార్తె మతాంతర వివాహం చేసుకుందని అల్లుడి హత్యకు ఓ మామ పథకం పన్నాడు. రౌడీషీటర్‌తో సుపారీ కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న కుమార్తె ఫిర్యాదు చేయడంతో విచారణచేపట్టిన పోలీసులు రౌడీ షీటర్‌ను అరెస్టు చేశారు.

అనుమానంతో చంపబోయారు.. మరొకరు బలయ్యారు..

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధాలు పెట్టుకోవడమేకాక ఆస్తి విషయంలో ఇబ్బందులు పెడుతున్న భార్యను కడతేర్చాలని యోచించాడు. టిప్పర్‌తో ఢీకొట్టి చంపాలని పథకం వేశాడు. కానీ చివరికి అమాయకురాలు బలైంది. మండలంలోని కోమటికుంట సమీపంలో ఈ నెల 9న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులలో ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు వివరాలు వెల్లడించారు. మండలంలోని కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈర్నపాటి పెద్దవెంకటేశ్వర్లుకు అదే గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మమ్మతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. గ్రామానికే చెందిన ఓ వ్యక్తితో సుబ్బలక్ష్మమ్మకు వివాహేతర సంబంధం ఉందనే ఆరోపణతో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో పెద్దవెంకటేశ్వర్లు తమ్ముడు చిన్నవెంకటేశ్వర్లుతోపాటు మరో ఇద్దరితో కలిసి 2005లో సదరు వ్యక్తిని గొడ్డళ్లతో నరికి హత్య చేశారు. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు 14 సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించి 2019లో విడుదలయ్యారు. అప్పట్నుంటి పెద్దవెంకటేశ్వర్లు, సుబ్బలక్ష్మమ్మలు దూరంగానే ఉంటున్నారు. ఈ క్రమంలో సుబ్బలక్ష్మమ్మ పలుమార్లు భర్తతో ఆస్తి విషయంలో గొడవపడింది. అంతేకాక మరొకరితో వివాహేతర సంబంధం ఆమె కొనసాగిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. వీటన్నింటిని మనసులో పెట్టుకున్న అన్నదమ్ములు పెద్దవెంకటేశ్వర్లు, వెంకటరమణ, చిన్నవెంకటేశ్వర్లు ఎలాగైనా సుబ్బలక్ష్మమ్మను మట్టుపెట్టాలని పథకం రచించారు. వెంకటరమణకు చెందిన టిప్పర్‌ను ఉపయోగించి చిన్నవెంకటేశ్వర్లు ఈ నెల 9న కే కొత్తపల్లి - మార్కాపురం మధ్యలో మాటువేసి ఉన్నారు. ఈ సమయంలో కె.కొత్తపల్లి గ్రామం నుంచి స్కూటీపై వరుసకు మనువరాలయ్యే ఏడుమల్ల రాధాతో సుబ్బలక్ష్మమ్మ మార్కాపురం వస్తోంది. దీంతో టిప్పర్‌తో స్కూటీని చిన్నవెంకటేశ్వర్లు వెంబడించాడు. సుమారు కోమటికుంటకు రెండు కిలోమీటర్ల దూరంలో చిన్నవెంకటేశ్వర్లు టిప్పర్‌తో సుబ్బలక్ష్మమ్మ స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై నుంచి రాధ ఒక్క ఉదుటున రోడ్డుపై పడి మృతిచెందింది. సుబ్బలక్ష్మమ్మ గాయాలతో బయటపడినట్లు గ్రహించిన చిన్నవెంకటేశ్వర్లు టిప్పర్ దిగివచ్చి కర్రతో మళ్లీ దాడి చేశాడు. అటుగా వాహనాలపై వెళ్తున్న వాళ్ల ఆగి కేకలు వేయడంతో చిన్నవెంకటేశ్వర్లు టిప్పర్‌తో పరారయ్యాడు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావుల పర్యవేక్షణలో నిందితుల కోసం గాలించారు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో ఉన్న టిప్పర్ యజమాని వెంకటరమణ, చిన్నవెంకటేశ్వర్లును అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు సుబ్బలక్ష్మమ్మ భర్త పెద్దవెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు.



అంజలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

కంభం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను తలపై కర్రతో కొట్టి హత్య చేసిన ఘటన కంభం పట్టణం సాద్‌మియా వీధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం... పట్టణంలో సాద్‌మియా వీధిలో అర్ధవీటి శివరంగయ్య, భార్య అంజలి (40)తో నివసిస్తున్నారు. శివరంగయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ వివాహం చేశాడు. అయితే ఇటీవల భార్య అంజలి ప్రవర్తనపై శివరంగయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం తెల్లవారుజామున ఇరువురి మధ్య వాదన చోటుచేసుకొంది. దీంతో శివరంగయ్య కోపంతో కర్ర తీసుకొని అంజలి తలపై బలంగా కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు శివరంగయ్య పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు ఎస్సై తెలిపారు. హత్య జరిగిన ప్రాంతానికి సీఐ మల్లికార్జునరావు, ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అల్లుడిని హత్య చేసేందుకు సుపారీ

రూ.3 లక్షలకు రౌడీషీటర్‌తో ఒప్పందం.. నిందితుడు అరెస్టు

పెద్దారవీడు జనవరి 12(ఆంధ్రజ్యోతి): కుమార్తె మతాంతర వివాహం చేసుకోవడంతో కక్ష పెంచుకొన్న తండ్రి అల్లుడిని అంతమొందించేందుకు పన్నాడు. అందుకుగాను ఓ రౌడీషీటర్‌ను ఎంచుకున్నాడు. అల్లుడిని హత్య చేసేందుకు సదరు రౌడీషీటర్‌కు రూ.3 లక్షల సుపారీ కూడా చెల్లించాడు. చివరకు విషయం తన కుమార్తెకు తెలియడంతో రౌడీషీటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... మార్కాపురం మండలం నికరంపల్లికి చెందిన దూదేకుల దాదావలి కుమార్తె ఖాసింబి అదే గ్రామానికి చెందిన బత్తుల అంకయ్యను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి అంకయ్యపై దాదావలి కక్ష పెంచుకున్నాడు. దాదావలి పదిరోజుల క్రితం గతంలో హత్య కేసులో నిందితుడైన బట్టగిరి రాఘవేంద్రరెడ్డిని కలిశాడు. అంకయ్యను అంతమొందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందుకుగాను రూ.3 లక్షలు చెల్లించేందుకు అంగీకరించాడు. ఈ హత్యాపథకం గురించి సమాచారం తెలుసుకున్న నికరంపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోగిరెడ్డి సుబ్బారెడ్డి విషయాన్ని దాదావలి కుమార్తె ఖాశింబీకి తెలియజేశాడు. దీంతో ఖాసింబీ బట్టగిరి రాఘవేంద్రరెడ్డి, తన తండ్రి దాదావలిపై చర్యలు తీసుకోవాలని పెద్దారవీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్సై అనిల్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్ అరెస్టు

నికరంపల్లికి చెందిన దూదేకుల దాదావలితో కుదిరిన ఒప్పందం మేరకు బత్తుల అంకయ్యను హత్య చేసేందుకు సుపారీ తీసుకొని పథక రచన చేస్తున్న రౌడీషీటర్ బట్టిగిరి రాఘవేంద్రరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. 2021లో రౌడీషీటర్ రాఘవేంద్రరెడ్డిపై హత్య కేసు నమోదైంది. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది.

పోటాపోటీగా క్రికెట్

- విజయం సాధించిన ఏలూరిస్ సౌత్ జోన్ సీసీ లెవెన్ చెన్నై, జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ లెవెన్ చెన్నై జట్లు

మేదరమెట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రావినూతలలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భ్రమర సంక్రాంతి కప్-2025 క్రికెట్ పోటీల ఆసక్తి కరంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం ఏలూరిస్ సౌత్ జోన్ సీసీ లెవెన్ చెన్నై, లైన్స్ సీసీ బెంగళూరు జట్ల మధ్య పోటీ జరిగింది. లైన్స్ సీసీ బెంగళూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ఏలూరిస్ సౌత్ జోన్ సీసీ లెవెన్ చెన్నై బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 142 పరుగులు సాధించింది. ఏలూరిస్ జట్టులోని ఆల్ రౌండర్ శర్వణ 9 బంతులలో 2 సిక్సలతో 20 పరుగులు సాధించాడు. 4 ఓవర్లు బౌల్‌చేసి 31 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. బౌలర్ మోసెస్ 4ఓవర్లు బౌల్‌చేసి 19 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లైన్స్ జట్టు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 141 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ జట్టులోని నందకిషోర్ 45 బంతులలో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 65 పరుగులు సాధించాడు. లైన్స్ సీసీ బెంగళూరు జట్టుపై ఏలూరిస్ సౌత్ జోన్ సీసీ లెవెన్ చెన్నై జట్టు ఒక్క పరుగుతో విజయం సాధించింది.

సాయంత్రం జరిగిన పోటీలలో జీఎస్‌టీ అండ్ సీఈ లెవెన్ చెన్నై, వైట్ ఫీల్డ్ సీఏ లెవెన్ బెంగళూరు జట్లు మధ్య పోటీ జరిగింది. వైట్ ఫీల్డ్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17.1 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ లెవెన్ చెన్నై జట్టు 9.2 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. జీఎస్‌టీ బౌలర్ హరీష్ రెండు మిడిన్ ఓవర్లతో కలిపి 4 ఓవర్లు బౌల్ చేసి 5 పరుగులు ఇచ్చి 3వికెట్లు తీశాడు. మరో బౌలర్ చంద్రశేఖర్ 4 ఓవర్లు బౌల్‌చేసి 13 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. జీఎస్‌టీ అండ్ సీఈ లెవెన్ జట్టు 5 వికెట్లు తేడాతో వైట్ ఫీల్డ్ సీఏ లెవెన్ జట్టుపై విజయం సాధించింది. ఈ పోటీలకు ఎంపైర్‌లుగా శ్రీనివాస్, రాజా, స్కోరర్‌గా సాయిరాజ్ వ్యహరించారు.

నేటి పోటీల వివరాలు

రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలలో సోమవారం ఉదయం ఏలూరిస్ సౌత్ జోన్ సీసీ చెన్నై, ఇండియన్ బ్యాంక్స్ అండ్ ఆర్‌సీ చెన్నై జట్లు మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం ఎస్‌కేఎం సీసీ లెవెన్ చెన్నై, జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ లెవెన్ చెన్నై జట్లు మధ్య పోటీ జరుగుతుందని అసోసియేసన్ అధ్యక్ష, కార్యదర్శులు కారుసాల నాగేశ్వరావు(బాబు), మోపర్తి శేషు తెలిపారు.



బ్యాట్స్‌మన్‌ను స్టంప్ అవుట్ చేస్తున్న వికెట్ కీపర్

అవీ..ఇవీ

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

● విలేకర్ల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని మండల ప్రజలు ఆనందోత్సవాలతో నిర్వహించుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక సీఐ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదేవిధంగా గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రస్తుతం కోడిపందేలు, జూదం, బైకొరేస్‌లు నిషేధించామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగే కొన్ని ప్రదేశాలను గుర్తించామన్నారు. ఆ సమాచారం తమ వద్ద ఉందని ఆ ప్రదేశాల్లో ప్రత్యేకంగా డ్రోన్‌కెమేరా నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మండలంలో ప్రతి గ్రామంలో పోలీస్ పికేటింగ్‌తో నిఘా ఉందన్నారు. గతంలో బేల్దార్ పనులు నుండి వచ్చిన యువకులు బైకొరేస్ నిర్వహించిన సమయంలో గొడవలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం డ్రోన్‌కెమేరాను ప్రారంభించారు.

ఫ్లై ఓవర్ పనులను త్వరగా ప్రారంభించాలి

గిద్దలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాచర్లగేటు కూడలిలో రైల్వే ఫ్లైఓవర్ పనులను త్వరగా ప్రారంభించాలని బీజేపీ నాయకులు రైల్వే అధికారులను కలిసి విన్నవించారు. రైల్వే గతిశక్తి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.జగన్‌మోహన్‌రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తిరుమలరావులను కంభం రైల్వేస్టేషన్‌లో స్థానిక బీజేపీ నాయకులు కలిశారు. ప్రధానమంత్రి గతిశక్తి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేసిన విషయం అధికారులకు వివరించారు. రాచర్లగేటు కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వెంటనే పనులను మొదలుపెట్టి సమస్య లేకుండా చేయాలని కోరారు. రైల్వే అధికారులను కలిసిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ. రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు

మార్కాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహించడం నిషేదమన్నారు. సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే సహించేదిలేదన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో సంక్రాంతిని జరుపుకోవాలని సూచించారు.

గిద్దలూరుటౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాట వంటి జూదం నిర్వహించడం నిషేధమని, ఎవరైనా కోడిపందేలు, జూదాలు ఆడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ కె.సురేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంప్రదాయ క్రీడల పేరుతో ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు సంక్రాంతి పండుగ నేపథ్యంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలు నిర్వహించాలన్నారు. పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంతో నిర్వహించుకోవాలన్నారు. కోడిపందేలు జరిగే ప్రాంతంలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జేవీవీ కేలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక రూపొందించిన సైన్స్ క్యాలెండర్ 2025ను ఆవిష్కరించి మాట్లాడారు. గ్లోబల్ వార్మింగ్ పెరిగి భూగోళం భవిష్యత్తు పెద్ద ప్రమాదంలో పడుతున్న ప్రస్తుత తరుణంలో పర్యావరణ స్పృహను సామాన్య ప్రజానీకంలో పెంచడానికి జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయన్నారు. నిబద్ధత కలిగిన జేవీవీ ప్రతి గ్రామంలో పర్యావరణ చైతన్యాన్ని నింపే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు స్వరూపారెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి విశ్వరూపం, ప్రైవేటు పాఠశాలల యూనియన్ మాజీ అధ్యక్షులు రామిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు రంగారెడ్డి, జయచంద్రారెడ్డి, జేవీవీ నాయకులు అల్లూరయ్య, జయరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, రమేష్, ఖాశిం, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంక్రాంతి శుభాకాంక్షలు

గిద్దలూరుటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, నియోజకవర్గ ప్రజలు విద్యా, ఉపాధి, వ్యవసాయ రంగాలలో ముందడుగు వేయాలని, సుఖ సంతోషాలతో ఈ పండుగను నిర్వహించుకోవాలన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రజలు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, అతివేగంతో వెళ్లకుండా నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేయాలన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొండపి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ముప్పవరం జడ్పీస్కూల్‌లో 1974-75, 1975-76, 1976-77 సంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశం అయ్యారు. వయసు మీద పడినా ఉత్సాహంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు హరిముకుందారెడ్డి, జి. శ్రీనివాసరావు, నరసింహారావు, సీహెచ్.సుబ్బారావులను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు మద్దినేని వెంకయ్య, ప్రవచనకర్త కప్పగంతుల జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పెద్దదోర్నాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బయన్నగూడెంలో స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 45 కుటుంబాలకు రూ.25 వేల విలువైన 12 రకాల సరుకులు అందజేసినట్లు చైర్మన్ పులి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ ఉపాధ్యక్షురాలు షేక్ షబానా, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మహిళా సెల్ జిల్లా చైర్మన్ ఎస్ గీతాభవాని పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

పొదిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛందసేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ గార్డెన్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మహిళల ముగ్గుల పోటీలు, కోలాటం, కుర్చీలాట, హరిదాసుల కీర్తనలు సాంప్రదాయ వంట కాలు కళ్లకు కట్టేలా తెలియజేస్తూ అలరించాయి. ముందుగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ముగ్గు లను అందంగా అలంకరించారు. వనజాక్షి ఆధ్వర్యంలో మార్కాపురం నుంచి వచ్చిన కోలాటబృదం ప్రదర్శించిన కోలాటం అక్కడికి వచ్చిన ప్రజలను ఎంతగానో అలరించింది. మహమ్మద్ రఫీ, బండి అశోక్ బృదంతో ఏర్పాటు చేసిన పాటకచేరి, నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించాయి. ముఖ్యంగా సాంప్రదాయ వంటకాలను తయారు చేసి కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు రుచి చూపించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మన సంప్రదాయాలు కనుమరుగౌతున్న తరుణంలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యం లో సాంప్రదాయాలను గుర్తు చేస్తూ కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఆట, పాటల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు సామంతపూడి నాగేశ్వరరావు, శ్రీని వాసరావు, కల్లం సుబ్బారెడ్డి, యల మందారెడ్డి, శ్రావణి, తానికొండ వెంకట్రావు, మేడా నరసింహారావు తది తరులు పాల్గొన్నారు.



పొదిలిలో హరిదాసుడి ప్రత్యేక అలంకరణ, ముగ్గులు వేస్తున్న మహిళలు, కోలాటం ఆడుతున్న చిన్నారులు



పోలీసు స్టేషన్ ముందు రంగవల్లులు అద్దుతున్న సిబ్బంది

పోలీసు స్టేషన్‌కు సంక్రాంతి శోభ

మార్కాపురం : స్థానిక పోలీసు స్టేషన్‌లు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. భోగి, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని మార్కాపురం టౌన్, రూరల్ పోలీసు స్టేషన్‌లకు చెందిన మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డు సిబ్బంది రెండు స్టేషన్‌ల ముందు సాంప్రదాయబద్ధంగా కల్లాపి చల్లారు. సంక్రాంతిని ఆహ్వానిస్తూ పలు రకాల రంగులతో రంగవల్లులను కళాత్మకంగా తీర్చిదిద్దారు.

గిద్దలూరు : పట్టణంలోని కుసుమ హరనాథ మందిరం ఆవరణలో నియోజకవర్గ దేవాలయాల కమిటీ, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి 4 బహుమతులతోపాటు పది మంది కన్సోలేషన్ బహుమతులు విజేతలకు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతి అందజేశారు. ప్రథమ విజేతగా బెల్లం హిమబిందు, ద్వితీయ బహుమతి దుద్యాల వందన, తృతీయ బహుమతి తూర్పునాటి నరసమ్మ, నాల్గవ బహుమతి గాదంశెట్టి అంకితసాయి దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు చేరెడ్డి యర్రారెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయ భాస్కర్‌రెడ్డి, వేంకటేశ్వరస్వామి దేవస్థాన అధ్యక్షులు వీరయ్య, వివిధ వర్గాల ప్రతినిధులు కిరణ్, బాలు, నాగేశ్వరరావు, నరసింహరావు, దాతలు పాల్గొన్నారు.

బయన్నగూడెంలో నీటి సమస్యను పరిష్కరించాలి

ఖాళీ బిందెలతో రోడ్డుపై గిరిజన మహిళల ఆందోళన



రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న గిరిజన మహిళలు

పెద్దదోర్నాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తమ గూడెంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని చెంచుగిరిజన మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని బయన్నగూడెంలో పది రోజులుగా నీటికి ఇబ్బందులు తలెత్తుతుండడంతో చెంచు గిరిజన మహిళలు చిన్న దోర్నాల వద్ద దోర్నాల-మార్కాపురం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఒక బోరుబావి ఉందని అయితే అందులో మోటారు పడిపోయిందన్నారు. నీళ్ల కూడా అడుగంటడంతో పంచాయతీ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో కొన్ని రోజులు ట్యాంకరుతో నీటిని సరఫరా చేశారన్నారు. ఇప్పుడు వాళ్ల కూడా నిలిపి వేయడంతో వ్యవసాయ మోటార్ల వద్ద తెచ్చుకుం టూ కాలం గడుపుతున్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం పంట లకు నీరు సరిపోవడం లేదని రైతులు కూడా నీరు ఇవ్వడం లేదన్నారు. దీంతో నీటికి కష్టాలు పడుతున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. గ్రామస్థుల ఆందోళనతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రయాణికులు పోలీసుస్టేషనుకు పిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై మహేష్ గిరిజనులతో మాట్లాడి విషయం తెలుసుకొని పంచాయతీ అధికారులతో చర్చించారు. రేపటి నుంచి నీటిని అందిస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

పోలేరమ్మకు ఆదివారం జాతర



ప్రత్యేక అలంకరణ పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మంతనాలమ్మకు రాఘవ రెడ్డి పూజలు



గుడిలో పూజలు చేస్తున్న రాఘవరెడ్డి

పెద్దదోర్నాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కొలువైన మంతనాలమ్మ అమ్మవారి గుడిలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అధ్యయన ఉత్సవం



అధ్యాయనోత్సవంలో శ్రీదేవి భూదేవి ఆండాళ్ సమేత చెన్నకేశవస్వామి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం అధ్యాయనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి, అండాల్ అమ్మవారు, రామానుజాచార్యుల ఉత్సవర్లకు పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఆండాల్ అమ్మవారికి నీరాటోత్సవం నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి నీరాటోత్సవం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు టీపీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నిట్టూరి వెంకట రమేష్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.



హాజరైన భక్తులు

సంకురుడా మా ఇంటిని చల్లగా చూడు

● ఇళ్లపై జిల్లేడు ఆకులు ఏర్పాటు



ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన జిల్లెడు పత్రం

పుల్లలచెరువు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి ముందు రోజు నియోజవర్గంలోని ఏ గ్రామంలో చూసినా, ప్రతి ఇంటిపై జిల్లెడు మొక్క ఆకులు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో ధాన్యం, బస్తాలు, గడ్డివాములు, ఇళ్లపైన జిల్లెడు మొక్క ఆకులు ఏర్పాటు చేశారు. పెద్దల మాట మేరకు సంకరుడు(సూర్యుడు) ఏటా సంక్రాంతి రోజున మకర రాశిలోనికి ప్రవేశించి దక్షణాయనం నుంచి ఉత్తరాయనానికి ప్రయాణం మొదలుపెడతాడు. ఈ క్రమంలోనే సూర్యుడనికి ప్రీతిపాత్రమైన జిల్లేడు (ఆర్కపత్రం) మొక్క ప్రతి ఇంటిపై ఏర్పాటు చేసుకుంటారు ప్రతి ఇంటిపై తన చూపు చూసి జిల్లెడు మొక్క వున్న ఇంటిపై సంకురుడు మంచి చేస్తాడని భక్తులు విశ్వసిస్తారు. దీంతో తన ఇంటిపై సంకురుడు మంచి జరగాలని ప్రజలు తన ఇంటితో పాటు ధాన్యం, వారికి పనికొచ్చి వాటిపై భోగికి ముందు రోజు సాయంత్రం జెల్లెడు ఆకులు వేయడం తరతరాలకు వస్తుంది.

పీవీఆర్ మైదానాన్ని క్రీడలకే వినియోగించాలి

● యువజన క్రీడా సమాఖ్య డిమాండ్

● ఎన్టీఆర్ కళాపరిషత్ ఏర్పాట్లు నిలిపివేత



ఆగిన నాటకోత్సవాల ఏర్పాట్లు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీవీఆర్ స్కూలు క్రీడామైదానంపై మరోసారి వివాదం చోటు చేసుకుంది. ఈ మేరకు ఆదివారం ఎన్టీ ఆర్ కళాపరిషత్ నాటకోత్సవాల సందర్భంగా చేపట్టిన పనులను యువజన క్రీడా సమాఖ్య అడ్డుకుంది. వివరా ల్లోకెళితే.. ఈనెల 18వ తేదీ నుంచి స్థానిక పీవీఆర్ క్రీడా మైదానంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలను నిర్వహించనుండగా అందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. అయితే పీవీఆర్ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు, యువజన క్రీడా సమాఖ్య ప్రతినిధులు దీనిపై అభ్యంతరం తెలిపారు. క్రీడామైదానాన్ని ఎలాంటి వ్యాపార సంబంధమైన వాటికి కేటాయించకూడదని వెల్లడించారు. నాటిక పోటీలకు కార్పొరేషన్ కమిషనర్ అనుమతి ఉందని పరిషత్ ప్రతినిధులు తెలియజేయగా, అదే విషయాన్ని సమాఖ్య సభ్యులు కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. ఆ లెటర్ తాను ఇవ్వలేదని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాదన జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ మైదానంలో వివిధ వ్యాపారాలకు కేటాయించడాన్ని తప్పు పడుతూ 2017 లో 314 నెంబరుతో పిల్ వేసినట్లు తెలిపారు. దీంతో అప్పటి నుంచి గ్రౌండ్ విషయమై కోర్టులో నడుస్తుందని చెప్పారు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారు లు వివిధ రాజకీయ కార్యక్రమాలకు, దీపావళి వేడుకలకు కేటాయించడంతో తాజాగా మరోసారి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవా లు జరిపేందుకు వచ్చారని, దీనిని తాము అంగీకరించడం లేదని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల పీవీఆర్ గ్రౌండ్ ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు కేటాయించవద్దని చెప్పారు. దీంతో ఎన్టీఆర్ కళా పరిషత్ నాట కోత్సవాల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. దీనిపై కమిషనర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా, కోర్టులో పిల్ ఉందని తెలిసిందని, దీనిపై పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకుంటా మన్నారు. అప్పటి వరకు పనులు నిలిపివేయాలని తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'యువత-భారత భవిత' అంశంపై సెమినార్

గిద్దలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రేమసుధా మందిరం ఆవరణలో శ్రీసత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా 'యువత-భారత భవిత' అనే అంశంపై పర్సనాలిటి డెవలప్‌మెంట్ సెమినార్ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సత్యసాయి సేవాసమితి హైదరాబాద్ నుంచి ఎ.శివకళాధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లైఫ్‌స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్, ఉన్నతంగా ఎదగడానికి కావలసిన దృక్పథం, యువతను తప్పుదోవ పట్టించే ఆకర్షణలను ఎలా అధిగమించాలి, వ్యక్తిగత కుటుంబం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ఆచరించి విదేశాల్లో కూడా ఆ ఘనతను చాటిన వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని సాయిబాలాజీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి అన్నారు. ఆ పాఠశాలలో వివేకానందుని 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ.. వివేకానందుడు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికోసం కృషి చేశారని, విద్యార్థులు కూడా ఆ విధంగా కృషి చేయాలన్నారు. పాఠశాల డైరెక్టర్లు ఆనంద్‌బాబు, సుబ్బారావులు మాట్లాడుతూ.. వివేకానందుని గొప్పతనం గుర్తించిన భారత ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా ఆయన జయంతిని ప్రకటించటం ఎంతో గొప్ప విషయమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. త్రివిక్రమ అభ్యుదయ కళా సంఘం ఆధ్వర్యంలో గాంధీ బజార్‌లో వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రంగనాయకులు, సాయి మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు, నాయకులు శ్రీధర్, నూనె అల్లూరి రెడ్డి, చెక్కా సుబ్రహ్మణ్యం, చెక్కా కేశవులు, చెన్నయ్య పాల్గొన్నారు. వివేకానంద విద్యాపీఠంలో వివేకానంద జయంతి నిర్వహించారు.

తర్లుపాడు : యువత స్వామి వివేకానందుని అడుగుజాడల్లో నడవాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ పార్లపల్లి నీలకంఠేశ్వరరావు అన్నారు. స్థానిక హిందూ పాఠశాలలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణ పరమహంస ప్రియశిష్యుడని, వేదాంత యోగతత్వశాస్త్రంలో అత్యంత ప్రభావం కలిగించిన ఒక ప్రముఖ వ్యక్తి రామకృష్ణ మఠం వ్యవస్థాపకులు అని కొనియాడారు. వివేకానందుని ఆశయాలను వివరించారు. కార్యక్రమంలో విగ్రహదాత పార్లపల్లి ప్రసాద్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, నెహ్రూ యూత్ అధ్యక్షులు బి.పుల్లయ్య, వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ రావు, నేరెళ్ల కుమార్, షేక్ అక్బర్ వలి, రామకృష్ణారెడ్డి, కశ్శెట్టి జగన్, కోటి మోహన్, అప్పల సుబ్రహ్మణ్యం, శంకర్ పాల్గొన్నారు.

గిద్దలూరు : స్వామి వివేకానంద జయంతిని వివిధ సంస్థలు ఘనంగా నిర్వహించాయి. స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం నుంచి వివేకానంద చిత్రపటంతో రామకృష్ణ ధ్యానమందిరం వరకు శోభాయాత్ర నిర్వహిం చారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. వివేకానంద జీవిత చరిత్ర గురించి పలువురు వివరించారు. కార్యక్రమంలో రామకృష్ణ ధ్యానమందిరం అధ్య క్షులు హనుమంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తనయుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రంథాలయంలో జరిగిన వివేకానంద జయంతి వేడుకల్లో గ్రంథపాలకు రాలు ప్రసన్నకుమారి, యోగా గురువు నారాయణరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని వివేకానంద కాలనీలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, బీజేపీ నాయకులు చంద్రమోహన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : యువత ప్రతి ఒక్కరు వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం ఎర్రగొండపాలెంలోని ఆయన విగ్రహానికి నాయకులు, సంఘం నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిగా నిలిచిన యువశక్తి ఆయన అని కొనియాడారు. దేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తంగా చేసి చైతన్యస్ఫూర్తిగా నిలిపిన యువ నాయకుడు వివేకానంద అని అన్నారు. అలాంటి యువ నాయకుడి స్ఫూర్తిగా తీసుకొని మంచి నడవడికలో ఉండాలని యువతను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివేకానంద స్ఫూర్తి నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం : స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం వివేకానందుని జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు మాట్లాడుతూ 'లేవండి, మేల్కోండి, గమ్యం చేరేవరకు విశ్రమించకండి' అన్న వివేకానందుని ప్రేరణాత్మకమైన పిలుపు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.మస్తానయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మార్కాపురంలో వివేకానందుడి విగ్రహానికి నివాళి





గిద్దలూరులో ప్రజల శోభాయాత్ర, తర్లుపాడులో నివాళులు అర్పిస్తున్న అధికారులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో కె.నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేముల, భీమవరం, తూర్పుకంభంపాడు గ్రామాల్లో గోకుల్ షెడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెంచుకొని షెడ్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గజ్జల సుబ్బారెడ్డి ఆదెమ్మ, అన్నెం వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ సూరపురెడ్డి ఏడుకొండలరెడ్డి, వెంకటరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గజ్జల వెంకటరెడ్డి, అబ్బూరు గోవిందయ్య, చాగంటి హనుమంతరావు, చాగంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ముండ్లమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పూరిమెట్లలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం ఆరు జట్లు తలపడ్డాయి. ముండ్లమూరులో నా ఊరే నా ఇల్లు కమిటీ ఆధ్వర్యంలో కూడా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. రెండు గ్రామాల్లో హోరాహోరీగా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి.

మోటారు సైకిల్ అపహరణ

ముండ్లమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవాపురం గ్రామానికి చెందిన కందుల శ్రీహరికి చెందిన మోటారు సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అపహరించారు. ఈమేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు ధాన్యం కాటాకు కూలికి వెళ్తూ బసవాపురం బస్టాండ్ సెంటర్ వద్ద మోటారు సైకిల్‌కు తాళం వేసి పక్కన పొలంలో కాటా వేస్తున్నారు. తిరిగి వాహనం దగ్గరకు వచ్చేసరికి లేదు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 86 మంది హాజరు

దొనకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో కెరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్షకు 86 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. ప్రతిభచూపిన విద్యార్థులకు ఏడు సంవత్సరాలపాటు మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభుదాస్, దేవదానం, విక్టోరియా, ప్రమీల, నాగరాజు, లోకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎం ఆస్తులపై మద్రాసు హైకోర్టు తీర్పు హర్షణీయం

దొనకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అమెరికన్ బాపిస్టు క్రైస్తవ మిషనరీ ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని దొనకొండ ఏబీఎం చర్చి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 35 సంవత్సరాలుగా సీఎస్ నెంబర్ 124/1994 కేసులో వాదోపవాదాలు విన్న తర్వాత పీఏబీసీ ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదని తీర్పు ఇచ్చినట్టు తెలిపారు. ఎస్‌టీసీబీసీకి గాని, పీఏబీసీకి గాని ఏబీఎఫ్ఎంఎస్‌కు చెందిన ఆస్తులు అమ్మే అధికారం లేదని మద్రాసు హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పామూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటాసుసైకిస్టు గాయపడ్డారు. ఈఘటన ఆదివారం మండలంలోని కొత్తపల్లి వద్ద చోటుచేసుకుంది. సీఎస్‌పురం మండలం నాగులారంకు చెందిన షేక్ మౌలాలి పామూరు నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో మోటారుసైకిల్ అదుపుతప్పి కిందపడటంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేస్తున్నట్లు108 సిబ్బంది తెలిపారు.

ఎన్జీవో కాలనీలో చిల్లచెట్ల తొలగింపు

పామూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీలో ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో చిల్లచెట్లను తొలగించారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో దోమలు, విషసర్పాల సంచారంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత స్థలాల యజమానులకు, పంచాయతీవారికి తెలిపినా స్పందనలేదు. దీంతో స్థానికులు స్వచ్ఛందంగా చిల్లచెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. స్థానికులు చందాలు వేసుకొని ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. కార్యక్రమంలో ఎన్జీవో కాలనీ అధ్యక్షుడు గళ్లా చెన్నయ్య, డాక్టర్ వెంకటేశ్వరావు, చల్లగుండ్ల చంద్రశేఖర్, నరసరాజు, కదిరి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం

పీసీపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కోసం మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన చింతలపూడి సావిత్రి అనే మహిళ రూ.పది వేల విరాళం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని కనిగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నగదును అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ సామాన్య గృహిణి వైద్యశాల అభివృద్ధికి విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. సావిత్రిని ఆదర్శంగా వైద్యశాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఉగ్రను కలిసిన వారిలో మాలకొండారెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి

- సొంతూర్లకు చేరుకుంటున్న కుటుంబాలు
- కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు



పామూరులో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు

పామూరు, జనవరి 12, (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. బతుకు దెరువుకోసం దూరప్రాంతాల్లో ఉంటున్న వారు కుటుంబసభ్యులతో సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, రాష్ట్రాలతో పాటు విజయవాడ, గుంటూరు, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పనుల కోసం వలస వెళ్లినవారు ఆర్టీసీ, ప్రయివేట్ ట్రావెల్స్‌తో పాటు ప్రత్యేక వాహనాల్లో సొంతూళ్లకు చేరుకుంటున్నారు. మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు, దూబగుంట, వగ్గంపల్లి, కంభాలదిన్నె, బొట్లగూడూరు, ఇనిమెర్ల, నుచ్చుపొద, చిలంకూరు. బొట్లగూడూరు. వీరభద్రాపురం, లక్ష్మీనరసాపురం పడమటకట్టకిందపల్లి, మోపాడు, అయ్యన్నకోట, అయ్యవారిపల్లి, కోడిగుంపల, బోడవాడ, బుక్కాపురం, నర్రమారెళ్ల, సుబ్బక్కపల్లి గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది.

నర్రమారెళ్ల, కంభాలదిన్నె, బొట్లగూడూరు, పామూరు, సీఎస్‌పురం, మండలాల్లోని పలుగ్రామాల్లో గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌లతో పాటు పలురకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు పండుగ రోజు బహుమతులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తొలి తెలుగు పండుగ కావడంతో ఒకే ఇంటి పేరుతో ఉన్న కుటుంబాలన్నీ సొంతూర్లలో కలిసికట్టుగా పండుగ జరుపుకొంటున్నారు. సోమవారం భోగి మంటలు వేసేందుకు యువత సన్నాహాలు చేస్తున్నారు. పిండి వంటలతో మహిళలు బిజీబిజీగా ఉన్నారు. పండుగ సందర్భంగా వివిధ దుకాణాలు కిటకిటలాడుతున్నారు.

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

- స్వామి సన్నివాసానంద్‌జీ మహరాజ్



కనిగిరిలో మాట్లాడుతున్న స్వామి సన్నివాసానంద్‌జీ మహరాజ్

కనిగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానందుడి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని సమసమాజ స్థాపనకు కృషిచేయాలని శ్రీమత్‌స్వామి సన్నివాసనంద్ జీ మహరాజ్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక పొదిలి రోడ్డులోని దేవాంగనగర్ వద్ద ఉన్న రామకృష్ణ ధ్యానమందిరంలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతలో వ్యక్తిగతంగా తమలో ఉన్న ప్రతిభను గుర్తించుకోలేక చెడుమార్గాల అన్వేషణలో కొట్టు మిట్టాడుతున్నారన్నారు. చెడు మార్గాల ద్వారా సమాజానికి చేటుగా మారి అటు తల్లితండ్రులకు మానసిక క్షోభను మిగుల్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి మనిషిలో మంచి, చెడులు ఉంటాయన్నారు. కుళ్ళిపోయిన ఆహారాన్ని ఏవిధంగా త్యజిస్తామో, అదేవిధంగా ప్రతి మనిషిలోని చెడు భావనలు విడనాడి మంచి మార్గంలో నడిచేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. తద్వారా సమాజానికి, తల్లితండ్రులకు మంచిపేరు తెచ్చినవారవుతారన్నారు.

వివేకానందుడు సమాజ హితం కోసం, మతసామరస్యం, యువకులు దాగిఉన్న ప్రతిభను గుర్తించి వారిని ఆదిశగా ప్రోత్సహించేవారని స్వామీజి పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వివేకానందుడి మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వివేకానందుడి జీవిత చరిత్రపై నియోజకవర్గంలోని వివిద పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వామీజి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ మందిరం కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భారత జాతిని మేల్కొలిపిన వైతాళికులు హైందవ ధర్మ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన వివేకానందుని బాటలో యువత ముందుకుసాగాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వివేకానంద స్వామి జయంతి, జాతీయ యువజన దినోత్సవం ఆపార్టీ మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వివేకానందుని విగ్రహానికి రమణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.విజయకుమార్‌చారి, సీహెచ్ మల్లికార్జున, బి.హజరత్‌కుమార్, డి .పవన్, పాదే అరవింద్, ఎస్.శివకృష్ణ, డి.చరణ్, పాతపాటి పవన్, నాగేంద్ర పాల్గొన్నారు.



పామూరు: వివేకానంద విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న కేవీ రమణయ్య

వైసీపీ హయాంలో పాడి పరిశ్రమ నిర్వీర్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



గుండ్లపాలెంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పాడి రంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చినఇర్లపాడు గ్రామంలో ఆదివారం గోకులం షెడ్‌లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పాడి రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. పాడి రంగంపై ఆధారపడి జీవించే వారికి తగిన ప్రోత్సాహం కరువైందన్నారు. దీంతో చాలా మంది రైతులు పాడిరంగాన్ని విడిచి పెట్టారన్నారు. పాడి, పంట సమృద్ధిగా ఉంటేనే అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పాడిరంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పశువుల పెంపకందారుల ప్రోత్సాహానికి 90శాతం సబ్సిడీతో పశువుల పెంపకానికి ప్రధానంగా అవసరమైన షెడ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. కేవలం పది శాతం మాత్రమే రైతు వాటా కింద తీసుకుని 90శాతం సబ్సిడీతో ఉపాధి హామీ పథకం కింద రుణాలు అందిస్తున్నట్టు చెప్పారు. గోకులం షెడ్‌లను నిర్మించుకున్న రైతులకు గేదెలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి సబ్సిడీపై ఇచ్చేందుకు తగిన కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే కనిగిరి ప్రాంతంలో అత్యధికంగా పశుపోషకుల కోసం గోకులం షెడ్‌ల నిర్మాణానికి నిధులు సమీకరించినట్టు చెప్పారు.

అనంతరం బొమ్మిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని గుండ్లపాలెంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్, ఎంపీడీవో హనుమంతరావు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, నాయకులు యడవల్లి శ్రీనివాసులురెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

దర్శి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కాసీం మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. 2006-2007 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంతో ఆప్యాయంగా ఒకరికొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి మధురానుభూతిలను గుర్తు చేసుకున్నారు. సుమారు 17 సంవత్సరాల క్రితం పాఠశాలలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందరూ ఉమ్మడిగా ఒక గ్రూపు ఏర్పాటు చేసుకొని తరచూ మాట్లాడుకునే విధంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కార్యక్రమంలో ఉపాధ్యాయుల ఆర్.బేగం, మోహరున్నీసా, ఖాశీం ఖాజావలి, వెంకటేశ్వర్లు, సుధాకర్, సుభానీ, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన ట్రాఫిక్ సమస్య

- కనిగిరి ప్రజలకు తప్పని ఇబ్బందులు



రోడ్డుపైకి వచ్చిన పండ్ల వ్యాపారులు

కనిగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అధికారులు తీసుకున్న చర్యలు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ శాఖ లక్షలాది రూపాయలు వెచ్చించింది. నిధులైతే ఖర్చయ్యాయికాని సమస్య మాత్రం తీరలేదు. ప్రధానంగా పామూరు బస్టాండు కూడలి వద్ద నాలుగు రోడ్లలో తోపుడు బండ్లు యథాస్థితికి చేరాయి. రోడ్లపై వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజాసంక్షేమం, ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన పనులు నామమాత్రంగానే మారాయి.

అలాగే, మూడు నెలల క్రితం డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రత్యేక నిధులు వినియోగించి పనులు చేపట్టారు. ప్రధాన వీధుల్లోని భారీ డ్రైనేజీలను శుభ్రం చేసే పనుల్లో భాగంగా డ్రైనేజీ కాలువలపై చప్టాలను ధ్వంసం చేశారు. గతంలో వాటిపై చిరువ్యాపారాలు సాగిస్తూ రోడ్డుపైకి కూడా వచ్చి తోపుడు బండ్లు వ్యాపారాలు నిర్వహించేవారు. ప్రస్తుతం వాటిపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవటంతో పెద్ద అగాధాలుగా మారాయి. భారీ డ్రైనేజీలపై ఉన్న చప్టాలను తొలగించిన తొలినాళ్లలో ఓవక్కగా వ్యాపారాలు సాగించిన తోపుడు బండ్ల నిర్వాహకులు యథాప్రకారం మరలా రోడ్లపైకి వచ్చారు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికితోడు పండ్ల వ్యర్థాలను డ్రైనేజీ కాలువల్లో పడేస్తుండటంతో చెత్తకుప్పలుగా మారి మున్సిపల్‌శాఖ ద్వారా వెచ్చించి చేపట్టి పనులు నిరుపయోగమయ్యాయి. పామూరు బస్టాండు కూడలి వద్ద రోడ్డుపైకి వచ్చి తోపుడుబండ్ల నిర్వాహకులు వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య పునరావృతమైంది. ఇప్పటికైనా మున్సిపల్‌శాఖ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో వంతెన.. పరిశీలించిన డీసీ చైర్మన్

ముండ్లమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయోధ్య నగర్ - ఈదర గ్రామాల మధ్య మోదేపల్లి మేజరు కాలువపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు రైతులతో కలసి ఆదివారం పరిశీలించారు. 30 సంవత్సరాల క్రితం సాగర్ కాలువపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరటంతో పాటు రక్షణ గోడలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రాత్రుళ్ల ప్రమాదాలు పొంచిఉన్నాయి. ఈక్రమంలో ఆయన వంతెనను పరిశీలించారు. ఈవిషయాన్ని కుడికాలువ ప్రాజెక్టు చైర్మన్ పులకూరి కాంతారావుకు వివరించినట్టు ఆయన తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించటం జరుగుతుందన్నారు. అలాగే, మోదేపల్లి మేజరుపై వేముల దగ్గర కాల్వపై కల్వర్టు దెబ్బతిందన్నారు. రైతుల ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట అయోధ్య నగర్, ఈదర గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.



అయోధ్య నగర్ వద్ద శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. చల్లంగా చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, బాలాజీలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వాసు, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగ పూజలు

సీఎస్‌పురం(పామూరు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామంలో వెలసియున్న మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన నారాయణస్వామి ఏకశిల విగ్రహానికి ఉదయం మూలమంత్ర హవన సహిత రుద్రనవగ్రహ హోమాలు, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మేళతాళాలతో మహా నైవేద్యం సమర్పించారు. గోశాలలోని గోవులకు పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి అర్చకులు మంకాల వెంకటశివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో చతుర్వేద పూర్వక పుష్పయాగం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, దాతలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన వెంగయ్యకు సన్మానం



వెంగయ్యను సన్మానిస్తున్న డాక్టర్ ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టరేట్ పొందిన టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్యను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదివారం సత్కరించి అభినందించారు. న్యాయశాస్త్ర విభాగంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందారు. ఆదివారం కనిగిరిలో డాక్టర్ వెంగయ్య ఎమ్మెల్యే ఉగ్రను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డి.ప్రకాశం, ఎస్.తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విరాట్‌నగర్‌లో ముగ్గుల పోటీలు

పామూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం వద్ద సంక్రాంతి పండగ సంబరాల్లో భాగంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పట్టణ విశ్వబ్రాహ్మణ యువజనసంఘం, మహిళా సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా హనుమంతు



హనుమంతు

దొనకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా దొనకొండకు చెందిన కాళ్ల హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక రామాలయంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోటా హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బైసాని వీఎస్ శేఖర్‌బాబు, అధ్యక్షుడిగా కాళ్ల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా అచ్చుత శివశంకర్, కోశాధికారిగా వచ్చు రాజశేఖర్, మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ మండలంలో ఆర్యవైశ్య కుటుంబాల సభ్యులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తమవంతు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మునగా నాగరాజు, కాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్

దర్శి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన గొట్టిపాటి- నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు జరిగిన ఫైనల్ పోటీలో పొదిలి మండలం కుంచేపల్లికి చెందిన అంజి ప్యాంటర్స్ టీమ్ విజయం సాధించి ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులోభాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉల్లాసభరితంగా ముగియటం ఆనందదాయకమన్నారు.

ఈపోటీల్లో విజేత అంజి ప్యాంటర్స్ టీమ్‌కు రూ.1,15,116 నగదును డాక్టర్ లలిత్‌సాగర్ అందజేశారు. ద్వితీయస్థానం సాధించిన దర్శికి చెందిన గణేష్ వారియర్స్ టీమ్‌కు నగర పంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య రూ.65 వేలు అందజేశారు. మూడవస్థానంలో వచ్చిన దర్శి పట్టణంకు చెందిన డి7 రైడర్స్ టీమ్‌కు టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు రూ.45 నగదు బహుమతి అందజేశారు. నాల్గవస్థానంలో నిలిచిన దర్శికి చెందిన బీసీఏ టీమ్‌కు టీడీపీ నాయకుడు ఎం.యలమందారెడ్డి రూ.25 నగదు బహుమతి అందజేశారు. ఈ పోటీల్లో మొత్తం 32 టీమ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నిర్వాహకులు అంజినాయుడు, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దొనకొండలో ముగ్గుల పోటీలు

దొనకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని విజయాంజనేయస్వామి దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14వతేది మధ్యాహ్నం 2గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. మొదటి బహుమతి కుట్టుమిషన్, రెండవ బహుమతి గ్రైండర్, మూడవ బహుమతి డ్రస్సింగ్ టేబుల్, నాల్గవ బహుమతి మిక్సీ, ఐదవ బహుమతి కుక్కర్ అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఎంట్రీ ఫీజు రూ.50 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని బాలిరెడ్డి తెలిపారు.

బొద్దికూరపాడులో సంక్రాంతి సంబరాలు

తాళ్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పోలంరెడ్డి సూరారెడ్డి, రమణారెడ్డి, వీరనాగిరెడ్డి తెలిపారు. భోగి సందర్భంగా ఉదయం పది గంటలకు 18 ఏళ్ల పైబడినవారికి స్లోమోటార్ బైక్ రన్నింగ్ రేస్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో బొద్దికూరపాడు, చింతలపాలెం గ్రామస్థులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

నేడు బౌద్ధ స్థూపం వద్ద దీపోత్సవం

శ్రీలంక నుంచి రానున్న బౌద్ధ భిక్షువులు

కొల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం వద్దకు సోమవారం దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం నిమిత్తం శ్రీలంక నుంచి 50 మంది బౌద్ధ భిక్షువులు ఇక్కడికి రానున్నారు. ఉదయం 9 గంటలకు దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 40 బౌద్ధ స్థూపాల వద్ద 40 నెలల్లో ప్రతి నెలా దీపోత్సవం నిర్వహించనున్నారు. బౌద్ధ భిక్షు వు బోధిహిన్, యాభైమంది బౌద్ధ ఉపాసకులతో హాజరుకానున్నారు.

కాలు దువ్వుతున్న కోళ్లు

కత్తికట్టి కాలుదువ్వేందుకు కోళ్లు సిద్ధమైపోతే కట్టలు తెంచుకుని మరీ పందాలకు కోట్లవిలులైన నోట్లు బయటకు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కేవలం మూడురోజుల్లోనే కోట్లాది రూపాయలు చేతులు మారేందుకు కోడిపందాల బరులు సిద్ధమైపోయాయి. భోగి, సంక్రాంతి, కనుమరోజుల్లో పందాలు వేసుకునేందుకు అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వదిలేస్తుండటంతో దీనిని ఆసరా చేసుకుని కొన్నిచోట్ల ఇప్పటికే జూద క్రీడ కూడా మొదలైపోయింది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో, ఆదివారం నుంచే బరుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పేకాట,కోతముక్క,గుండాట జోరుగా సాగిపోతున్నాయి. కోడిపందాలైతే సిద్ధంచేసిన బరులతో పనిలేకుండా కృష్ణాతీరంలో సముద్రతీరంలోని కొన్నిచోట్ల పందాలు వేస్తున్నారు. తీర ప్రాంతంలో కోడిపందాల విషయంలో తగ్గేదేలేదంటూ పందెం రాయుళ్ళు కూడా నోట్లకట్లను బద్దలుకొట్టి సంప్రదాయ క్రీడపేరుతో పందాల రూపంలో విరజిమ్ముతూనే ఉన్నారు.

- సంప్రదాయం ముసుగులో కోడి పందాలకు సిద్ధం
- భారీగా బరులు, పేకాట శిబిరాలు
- ఒక్కో ఆటకు ఒక్కో రేటు
- తెలంగాణా నుంచీ పందాలకు బారులు
- పోలీసుల ఆదేశాలు బేఖాతరు



చెరుకుపల్లిమండలం తూర్పుపాలెంలో 30ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరులు



తెనాలి, కొల్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో అధికార పార్టీకిచెందిన కీలకనేతలే ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి కోడిపందాలు, పేకాట, లోనాబయట, కోతముక్క, గుండాట ఆడించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఆయా ఆటల నిర్వాహకులకు అప్పగించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా సరే కోడిపందాలు,పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసినా, అందుకు విరుద్ధంగా భారీ బరులను సిద్ధం చేశారు. కొల్లిపర, నాదెండ్ల మండలం సాతులూరు, రొంపిచర్ల మండ



కొల్లూరులోని కోడి పందేల బరి

లం కొనకంచివారిపాలెం మరికొన్నిచోట్ల బరులను పోలీసులు దున్నేశారు. డెల్టాలో మాత్రం బరులు యధావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. వేమూరు మండలం జంపనిలో అయితే ఏకంగా తెనాలి, రేపల్లె ప్రధానరహదారిపై సొంత బారికేడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టివెయ్యటం అధికారుల ఆదేశాల అమలుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పెదకూరపాడు మండలం ముస్సాపురం, అమరావతి మండలం లేమల్లె గ్రామంలో భారీ బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద ఎక్కువ శాతం టీడీపీ,జనసేన జెండాలను,భారీఫ్లెక్సీలను ఏర్పాటు చేసి మరీ సంక్రాంతి సంబరాలకు రారండి అంటూ బహిరంగంగానే ఆహ్వానం పలకటం విశేషం.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో...

ఉమ్మడి గుంటూరుజిల్లాలోని రేపల్లెనియోజకవర్గం చెరుకుపల్లిమండలం తూర్పుపాలెం,బాపట్లనియోజకవర్గంలోని పిట్టలవారిపాలెంలో, గుంటూరు, పల్నాడు జిలాల్లో అక్కడక్కడ కోడిపందాలు వేసేందుకు బరులను ఏర్పాటు చే శారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులెవరూ పట్టించుకు న్న పరిస్థితి తీర ప్రాంతంలో ఎక్కడా కనపడటంలేదు. రేపల్లె నియోజకవర్గం తూర్పుపాలెంలో ఒక వీఐపీ బరి, ఇతరుల కోసం ఏడుబరులు ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట ఆడుకునేందుకు ప్రత్యేక టెంటులను ఏర్పాటు చేశారు.

చెరుకుపల్లినుంచి నగరం వెళ్ళే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి నిబంధనలకు విరుద్ధంగా భారీఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ రహదారిలో వెళ్ళే ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనానికి రూ.100లు పార్కింగ్ ఫీజు, కార్లకు రూ.200లు ఫీజు వసూలు చేస్తున్నారు.

> రేపల్లె నియోజకవర్గంలో కోతముక్క, పేకాట, నెంబర్లాట, రింగ్ ఆట నిర్వహణ, హైదరాబాద్, విజయవాడకు చెందిన వారికి రూ.40లక్షల నుంచి రూ.80లక్షలకు కాంట్రాక్టు అప్పగించారని తెలుస్తోంది. పార్కింగ్ ప్రదేశాన్ని రూ.6లక్షల చొప్పున అధికార పార్టీలోని మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు వేలం పెట్టి రూ.5లక్షలకు పైగానే పాట నిర్వహించారు. బిర్యాని పాయింట్ ఏర్పాటునకు లక్ష రూపాయలు, శీతల పానీయాలు, గుట్కా, ఖైనీ, సిగరెట్లు అమ్ముకొనేందుకు లక్ష రూపాయలు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కోడి పందెం బరులు కూడా రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు తదితర కేటగిరీలుగా ఏర్పాటు చేసి ఆయా బరుల్లో ఆ కేటగిరీకి సంబంధించిన వారు పందాలు కాసుకునే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

తీరంలో జూలు విదిల్చిన జూదం

కూటమి ప్రభుత్వం పెద్దలకు అత్యంత సన్నిహితుడుగా పేరున్న వ్యక్తి అతను. అయితే రేపల్లె నియోజకవర్గంలో భారీ ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాడు. నగరంమండలం,ఏలేటిపాలెంలోని సపోట తోట మధ్య భారీ షెడ్డు, రేపల్లెమండలం ఉప్పూడి శివారులో భారీషెడ్డును ఏర్పాటుచేసి రాత్రి 7గంటలకు ప్రారంభించి ఉదయం 6గంటల వరకు పేకాట, కోతముక్క నిర్వహిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ఉభయగోదావరి జిల్లాల నుంచి జూదరులు ఇక్కడకు ప్రతి రోజూ వస్తుంటారు. నిత్యం వచ్చే వారికి ఇక్కడ సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇదే నిర్వాహకుడు గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణానది మధ్యభాగంలోని రేవులో రేపల్లెటౌన్, నగరం, నిజాంపట్నం ప్రాంతంలో అప్పటి వైసీపీ నాయకుల అండదండలతో భారీ పేకాట శిబిరాలు నిర్వహించేవారు. ప్రభుత్వం మారినా ఇప్పటి అధికారపార్టీనాయకుల అండదండలతో అతనే పేకాట శిబిరాలు నిర్వహించడం విశేషం. ఇది ఈ మూడు రోజుల తంతు కాదు. ప్రతి రోజూ జరిగే తంతేనని, ఒక్క కోతముక్క ఆటే రూ. 50 లక్షల వరకు ఉంటుంది. బంకినీ రూపంలో అతనికా రోజుకు రూ.2లక్షల వరకు వస్తాయంటే అక్కడ రోజు ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



తూర్పుపాలెంలో పేకాటకోతముక్క ఆడేందుకు ఏర్పాటు చేసిన గుడారం



తూర్పుపాలెంలో కోడిపందాల బరులవద్ద ఏర్పాటుచేసిన కోతముక్క లోనాబయట పేకాటశిబిరాలు

పల్లెకోనలో సిద్ధం కాని పందెం బరి

సంక్రాంతి సంబరాలలో భాగంగా భట్టిప్రోలు మండలం పల్లెకోన వద్ద ఏర్పాటు చేసిన బరి ఇంకా సిద్ధం కాలేదు. నియోజకవర్గంలోని మిగిలిన చోట్ల ఏర్పాటు చేసిన బరులలో పందాలు ప్రారంభం కావడంతో ఇక్కడ కూడా బరి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రింబవళ్ల శ్రమించి సోమవారం ఉదయానికి బరి సిద్ధం చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి కుమారుని చేత సంక్రాంతి సంబరాలు ప్రారంభం చేయించనున్నట్లు సమాచారం.

అదనపు ఆకర్షణగా ఎన్‌ఫీల్డ్ వాహనాలు



కోడి పందాలు బరులు వద్ద ఎన్‌ఫీల్డ్ వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిర్వాహకులు ప్రదర్శనగా ఉంచారు. కొల్లూరు, జంపని కోడి పందాల బరుల వద్ద నిర్వాహకులు ప్రతిపాదించిన పందాలు నెగ్గిన పందెంరాయుళ్లకు ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలు బహుమతులుగా ఇవ్వనున్నారు. గత ఏడాది కొల్లూరు మండలం పెసర్లంక వద్ద ఏర్పాటు చేసిన కోడి పందాల బరిలో రెండు ఎన్‌ఫీల్డ్ వాహనాలను నిర్వాహకులు ఒక్కొక్క కోడి పుంజు ఐదు పందాలు గెలిస్తే ఆయా పందెం రాయుళ్లకు ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేశారు. ద్విచక్ర వాహనాలను బహుమతిగా ఏర్పాటు చేయడంతో ఆయా బరులకు పెద్ద పెద్ద పందాలు కాసే పందెంరాయుళ్ల అధిక సంఖ్యలో వచ్చేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు ఈ పద్ధతి ఎంచుకున్నారు. అసలైన కోడి పందాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఆదివారం మాత్రం నిర్వాహకులు అనధికారిక కోడి పందాలకు తెర లేపారు.



చెరుకుపల్లి : తూర్పుపాలెంలో సిద్ధం చేసిన వీఐపీ కోడిపందాల బరి



కొల్లూరు : పందెం బరిలో ప్రారంభమైన కోడి పందాలు

భోగభాగ్యాల భోగి

పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికే భోగి పండగ

తెలుగునాట మకర సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అంతటి ప్రాముఖ్యత ఉన్న పండుగను తెలుగు ప్రజలు భోగితో మొదలు పెడతారు. తొలిరోజు భోగి మంటలతో మొదలయ్యే సంక్రాంతి వేడుకలు నాలుగు రోజులపాటు జరుపుకుంటారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో ఇంటిల్లపాదీ పండుగ వేడుకల్లో మునిగి తేలుతారు. అలా ప్రతి ఇంటికి సంతోషాలను స్వాగతించే తొలి పండుగ దినం భోగి కావడంతో దానికి తెలుగునాట ఎంతో ప్రాధాన్యముంది.



- నెల రోజులపాటూ మహిళల ధనుర్మాస పూజలు
- భోగి పండ్లు.. భోగి మంటలు.. బొమ్మల కొలువులతో సందడే సందడి
- చలిని తరిమి, వెచ్చదనాన్ని పంచే భోగి మంటలు
- నెల రోజులపాటు ఇళ్ల ముందు రంగవల్లులతో అలంకారాలు
- ఆనందంతో పాటు.. ఆరోగ్యాన్ని ఇచ్చే పండుగ

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగునాట పెద్ద పండుగగా జరుపునే సంక్రాంతిని మొదటిరోజు 'భోగి పండుగ'గా జరుపుకుంటారు. దక్షిణాయణంలో సూర్యుడు రోజు రోజుకూ భూమికి దూరమవడం వలన చలి విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. ఆ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణానికి ముందురోజుకి చలి తారాస్థాయికి చేరుతుంది. దీంతో ఆ చలిని తట్టుకోవడానికి ప్రజలంతా పెద్దగా మంటలు వేసుకుంటారు. కాల క్రమంలో అదే భోగి మంటలుగా ప్రజల సంప్రదాయంలో భాగమైపోయాయి. ఆ భోగి మంటల్లో తాము ఇప్పటి వరకూ పడిన కష్టాలను, బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చి రాబోయే ఉత్తరాయణంలో తమకు సుఖ సంతోషాలను ఇవ్వాలని కోరుతూ భోగి మంట్లో వేడు కుంటారు.

నెల రోజుల పూజా కార్యక్రమాలు

హిందూ మత విశ్వాసాలు, సంప్రదాయం ప్రకారం, మకర సంక్రాంతికి ముందు రోజున భోగి పండుగ వస్తుంది. సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి జనవరి 13, సోమవారం నాడు వచ్చింది. ఈ పండుగను రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమి ళనాడుల్లోనూ జరుపుకుంటారు. అయితే తెలుగునాట జరిగే సంక్రాంతికి ఎంతో ప్రత్యేకత ఉంది. భోగి రోజు నుంచే సంక్రాంతి సంబరాలు మొదల వుతాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆ సందళ్లు తారా స్థాయికి చేరతాయి. దాదాపు నెలరోజులపాటు ధనుర్మాస పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగి పండుగతో సంక్రాంతి వేడుకల్లోకి ప్రవేశిస్తారు. ధనుర్మాసంలో మహిళలు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి ధనుర్మాస వ్రతం ఆచరిస్తారు. యశోదా తనయుడుకి బాల భోగం సమర్పించి హారతి ఇస్తారు. ఆడపిల్లలు నెలరోజులూ ఇళ్ల ముంగిట్లో కళ్లాపు జల్లి రకరకాల రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టి, బంతి, చామంతి, తంగేడు, గుమ్మడి పూలతో అలంకరిస్తారు. శుభ సూచకంగా పసుపు, కుంకుమతో వాటిని పూజిస్తారు. వాటన్నింటికీ ముగింపుగా సంక్రాంతికి ముందురోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేసుకుని చిన్నా, పెద్ద అందరూ ఆ మంటల చుట్టూ చేరి చలికాచుకుంటారు.

భోగి పండుగ రోజున చాలా కుటుంబాల్లో చిన్నారులపై భోగి పండ్లను పోసి పెద్దలు ఆశీర్వదించడం పరిపాటి. అదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పండ్లు)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పండ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారని చాలా మంది నమ్ముతారు. కాగా భోగి పండ్లలో రేగి పండ్లదే అగ్రతాంబూలం. రేగి చెట్టును సంస్కృతంలో బదరీ వృక్షం అంటారు. బదరీ అనేది ఆ శ్రీమన్నారాయణుడికి మరో నామం. ఆయన పేరుకు ప్రతి రూపంగా భావించి రేగి పండ్లను పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. రేగి పండు సూర్యుడికి ప్రీతిపాత్రమైన ఫలం. సూర్యుడి రంగు, రూపు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణాలను కలిపి పిల్లల తలపై పోస్తారు. వాటిని తలపై పోయడం ద్వారా పిల్లలకు ఆ స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. పిల్లలకు ఉన్న దిష్టి తొలగిపోయి వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని పెద్దల విశ్వాసం. ఈ పవిత్రమైన రోజున ఇంద్ర దేవుడు, వరుణ దేవుడిని పూజిస్తారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు.

క్రీడల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- స్పోర్ట్స్ పాలసీని తెచ్చిన ఘనత చంద్రబాబుదే
- అసోసియేషన్ సభ్యులు అభినందనీయులు
- మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి పాలసీని తెచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఆదివారం రావినూతల స్టేడియంలో రూ.98లక్షలు వెచ్చించి నిర్మించిన పెవిలియన్ భవనాన్ని మంత్రి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలకు దీటుగా రావినూతలలో క్రికెట్ స్టేడియం అభివృద్ధి చేసిన అసోసియేషన్ సభ్యులు అభినందనీయులు అన్నారు. ఎంతో ప్రయాసకోర్చి ప్రతి సంవత్సరం సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు నిర్వహించడం రావినూతలకే చెల్లిందన్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల జట్లు వచ్చి పోటీలలో పాల్గొనడం ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే క్రీడాకారులను తయారు చేయాలని చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. అనంతరం పెవిలియన్‌లో షటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు. అనంతరం క్రికెట్ పోటీలను ఆ యన వీక్షించారు. కార్యక్రమంలో సినీ నటుడు రఘుబాబు, ఆర్ ఎస్ సీఏ అధ్యక్ష, కార్యదర్శులు కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి శేషు, పిన్నక హనుమయ్య, అనుబ్రోలు ప్రభాకర్, నాదెండ్ల శ్రీను, రామినేని శ్రీనివాసరావు, శివ, నాగబోయిన శ్రీను, యడ్లపల్లి నరసింహారావు, కారుసాల బ్రహ్మానందం, చేబ్రోలు నాగేశ్వరరావు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రావినూతలలో పెవిలియన్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

15 నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు

అనంతవరంలో ప్రదర్శనలు

యద్దనపూడి (మార్టూరు) జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో ఈ నెల 15 నుంచి 18వతేదీ వరకు ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, కమిటీ సభ్యులు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు.



నాటిక పోటీల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ సభ్యులు

ఈ నెల 15 వతేదీ బుధవారం రాత్రి విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే ప్రదర్శించే స్వేచ్ఛ నాటికతో పోటీలు ప్రారంభమవుతాయి. తరువాత న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్ విజయవాడ వారిచే ఐ ఏట్ ఇండియా నాటిక, తర్వాత శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారిచే కమనీయం నాటికను ప్రదర్శిస్తారు. ఇక 16 వతేదీ గురువారం రాత్రి మైత్రి కళానిలయం విజయవాడ వారిచే బ్రహ్మ స్వరూపం నాటిక, తర్వాత యంగ్ థియేటర్ విజయవాడ వారిచే 27వ మైలురాయి నాటిక, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారిచే నిశి నాటికలను ప్రదర్శిస్తారు. అదేవిధంగా 17వతేదీ శుక్రవారం రాత్రి యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారిచే నా శత్రువు నాటికను, తర్వాత స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారిచే కొండంత అండ నాటికను, చివరగా శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారిచే ఏది నిజం నాటికను ప్రత్యేక ప్రదర్శనగా ఇస్తారు. చివరి రోజు 18 వతేదీ శనివారం రాత్రి అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే విడాకులు కావాలి నాటికను తర్వాత చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారిచే (అ) సత్యం నాటికను, చివరగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే జనరల్ బోగీలు నాటికలను ప్రదర్శిస్తారు.

సత్తాచాటిన బాపట్ల జిల్లా గిత్తలు

- విజేతగా నిలిచిన ఆర్కే బుల్స్
- పోటాపోటీగా ఎడ్ల బలప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం (పర్చూరు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామ వేదికగా పోటాపోటీగా జరుగుతున్నాయి. ఆదివారం 9 జతల ఎడ్లు తలపడ్డాయి. న్యూకేటగిరీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్కే బుల్స్ (అత్తోట శిరీష చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎడ్లు) జత 5,169 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పురుషోత్తపట్నంకు చెందిన షేక్ అబ్దుల్ సత్తార్‌కు చెందిన ఎడ్లు 4917.7 అడుగులతో ద్వితీయ, గుంటూరు జిల్లా కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లు 4,697.8 అడుగులతో మూడో స్థానం, తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన రోహన్‌బాబుకు చెందిన ఎడ్లు 4,659.8 అడుగులతో నాలుగో స్థానం సాధించాయి. గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లు 4,413.10 అడుగుల దూరం లాగా 5వ స్థానంలో నిలిచాయి.



పోటీలో బండ లాగుతున్న ఎద్దులు

బదిలీల్లో ఏడాది సర్వీస్‌ను ప్రాతిపదికగా తీసుకోవాలి

» మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం

అందజేసిన హైస్కూల్ హెచ్‌ఎంలు



మంత్రి రవికుమార్‌తో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు మినిమం సర్వీస్‌ను ఒక సంవత్సరం ప్రాతిపదికగా తీసుకోవాలని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అద్దంకిలో మంత్రి రవికుమార్‌ను కలిసిన హెచ్‌ఎంలు తమ సమస్యలను రవికుమార్‌కు వివరించారు. గత ప్రభుత్వం హెచ్‌ఎంల ప్రమోషన్‌లలో అస్తవ్యస్త విధానాలను అనుసరించడంతో 2023లో ప్రమోషన్‌లు తీసుకున్న హెచ్‌ఎంలు 8 నెలల సర్వీస్‌ను కోల్పోవాల్సి వచ్చిందని, ప్రభుత్వం ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలకు రూపొందిస్తున్న చట్టంలో కనీస అర్హత 2 సంవత్సరాలుగా నిబంధన విధించనున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకుల ద్వారా తెలిసిందని వివరించారు. రెండు అకడమిక్ ఇయర్స్ లేదా ఒక సంవత్సరం సర్వీసు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అయినా 2023లో పదోన్నతి పొందిన హెచ్‌ఎంలు కూడా కౌన్సిలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించే విధంగా విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకు పోవాలని కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని హెచ్‌ఎంలు మహబూబ్‌ఖాన్, ఎం.శ్రీనివాసరావు, రామిరెడ్డి రాఘవ, పి.కృష్ణ ప్రసాద్, షేక్ మీరా వలి, ఇందిరా, రామారావు ఉన్నారు.



అద్దంకిలో అరిసెల కోసం రోకళ్లతో బియ్యం దంచుతున్న మహిళలు

గ్రామాల్లో రోకళ్ల చప్పుళ్లు

సంక్రాంతి వంటకాలలో మహిళలు బిజీ బిజీ

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వంటకాలతో మహిళలు బిజీబిజీగా ఉన్నారు. అన్ని రకాల వస్తువులను, తిండి పదార్థాలను సైతం ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే నేటి యువత కు ఒకప్పటి ఇంటి పిండి వంటల తయారీ ఒకింత కొత్తగానే ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో నేటికి కొంత మంది మహిళలు పిండి వంటలను ఇంట్లోనే తయారు చేసుకుంటున్నారు. మరి కొంత మంది మహిళలు అయితే పిండిని కూడా ఇళ్లలో రోళ్లలో దంచుతున్నారు. అద్దంకి పట్టణంలో సైతం పలు కుటుంబాలు సం క్రాంతి వంటకాలను ఇళ్లలోనే తయారు చేసుకుంటున్నారు. ప్రధానంగా రైతు కుటుంబాలు ఎక్కువగా నివాసం ఉండే కాకానిపాలెం, న ర్రావారిపాలెం, దామావారిపాలెం తదితర ప్రాంతాలలో రోకళ్ల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులందరూ కలిసి పిండి వంటకాల తయారీలో నిమగ్నమయ్యారు.

తీరిన విద్యార్థుల సమస్యలు

» మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో

చందలూరు పాఠశాలకు బస్సు సౌకర్యం

» స్కూల్‌కు వెళ్లే దారిలో వీధి దీపాల ఏర్పాటు

పంగులూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత నెల 7వ తేదీన చందలూరు ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిందడ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించారు. గ్రామానికి కిలోమీటర్ పైగా దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు బస్సు వసతి కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరగా, సాయంత్రం వేళ స్టడీ అవర్స్ పూర్తయిన తర్వాత రాత్రిపూట చీకటిలో ఇంటికి రావడం కష్టంగా ఉందని, పాఠశాల వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో గొట్టిపాటికి విన్నవించారు. విద్యార్థుల సమస్యలపై స్పందించిన మంత్రి గొట్టిపాటి చొరవతో పాఠశాలకు చేరుకునేందుకు ప్రధాన కూడలి నుంచి అద్దంకి ఆర్టీసీ అధికారులు పాఠశాల వేళలో బస్సు వసతిని కల్పించగా, విద్యుత్ శాఖ అధికారులు పాఠశాల వరకు విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయడం, గ్రామ పంచాయతీ వీధిలైట్లను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. తాము కోరిన వెంటనే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి గొట్టిపాటికి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



అమ్మవారి కొలుపులో స్థానికులతో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

కనులపండువగా మహాలక్ష్మి గ్రామోత్సవం

అమ్మవారి పూజలో వేలాదిగా పాల్గొన్న భక్తులు

పంగులూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం వైభవంగా జరిగింది. మురకొండ వంశస్తులు పీఠం వద్ద అమ్మవారికి మోయనం సమర్పించారు. ఆదివారం ఉదయం వేద పండితులు పీఠం వద్ద అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో శక్తి స్థలానికి చేరుకుని పురంలో కొలువుదీరిన అమ్మవారి కలశంతో సాగిన గ్రామోత్సవంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ భక్తులు కలశంపై పూలు, తమపాకులు చల్లుతూ సాగిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది. పుర వీధులలో ఊరేగిన అమ్మవారు తిరిగి పురంలో కొలువు దీరారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

చినగంజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకునేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని చినగంజాం జడ్పీ పాఠశాల ఎన్‌సీసీ అధికారి సీహెచ్ సుబ్బారావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు చీరాల ఎన్‌ఆర్‌అండ్ పీఎం హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏ సర్టిఫికెట్ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏ సర్టిఫికెట్ పరీక్షకు పాఠశాలకు చెందిన 29 మంది బాలుర్లు, 19 మంది బాలికలు శనివారం జరిగిన ప్రాక్టికల్ పరీక్షకు హాజరై, ఆదివారం జరిగిన థియరీ పరీక్షకు రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఎన్‌సీసీ అధికారి ఎస్.నరసింహారావు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ

మార్టూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో ఉన్న లారీ డ్రైవర్ ఎదురుగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా ఆ లారీ ముందుకు కదిలి దాని ముందున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మార్టూరులో హీరోషోరూం ఎదురుగా జరిగింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన లారీతోపాటు మరోలారీ, ప్రైవేటు బస్సు దెబ్బతిన్నాయి. విజయవాడ నుంచి తిరుపతికి 39 మంది ప్రయాణికులతో వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు హిరో షోరూం వద్ద ఓ ప్రయాణికుడి కోసం ఆగింది. ఆ సమయంలో చిలకలూరిపేట వైపు నుంచి మార్టూరు వస్తున్న లారీ మార్టూరు టౌన్ లోపలకు వెళ్లేందుకు సర్వీసు రోడ్డులోకి ముందు ఆగి ఉన్న ట్రావెల్ బస్సు కారణంగా రోడ్డుపై ఆగింది. అప్పుడే గుంటూరు నుంచి కేరళ కు ఎండు మిరపకాయలను లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఆ లారీ ముందున్న బస్సును ఢీకొనడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. మరో ప్రైవేటు బస్సులో ప్రయాణికును తలరించారు. కేసు నమోదు చేశారు.

అభిమానం 'కిక్'

బాలకృష్ణ కటౌట్‌పై మద్యం



బాలకృష్ణ కటౌట్‌పై మద్యం పోస్తున్న అభిమాని

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా రిలీజ్ సందర్భంగా అద్దంకి పట్టణంలోని వీఎస్ఎస్ సినీ కాంప్లెక్స్ వద్ద కటౌట్‌ను ఏర్పాటు చేశా రు. ఓ బాలకృష్ణ అభిమానిలో అభిమా నం ఉప్పొంగి ఆదివారం ఏకంగా మాన్సన్ హౌస్ మద్యం బాటిల్‌ను తీసుకొని అభిషేకం చేస్తున్నట్లు కటౌట్‌పై పోశారు. దీంతో బాలకృష్ణ అభిమానులు కేరింతలు కొట్టారు.

120 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని చింతగుంపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మలపెంట జయరావు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద చీరాల శతాయుష్ ఇంటర్నేషనల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ వారు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో హాస్పిటల్స్‌కు చెందిన కన్సల్టెంట్ ఆయుర్వేదిక్ డాక్టర్లు సీహెచ్ సింధు, దాసరి ఉత్తరశ్రీ, జి.తేజేష్ పలు రకాల వ్యాధులకు సంబంధించి 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వతరెడ్డి మోహనరావు, గ్రామ పెద్దలు కూనపరెడ్డి కోటయ్య, గంటా సుబ్బయ్య, పల్లపోలు నరసింహారావు, బాపయ్య పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ఇంకొల్లు,జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరు గ్రామ శివారుల్లో పేకాట శిబిరంపై ఆదివారం ఎస్సై సురేష్ దాడులు నిర్వహించారు. పేక ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4600 నగదును స్వాధీనం చేసుకున్నారు.

చినగంజాం : కొత్తపాలెం గ్రామ శివారులోని పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పేక ఆడుతున్న ముగ్గురుని అదుపులోనికి తీసుకొని, రూ.1440 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మేదరమెట్ల : కొరిశపాడులో పేకాట ఆడుతున్న 6 గురును అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,690 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నేడు ముగ్గుల పోటీలు

మార్టూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం తూర్పుబజారున రామాలయం దగ్గర ముగ్గులు పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అలాగే స్లోసైక్లింగ్, స్లోబైకింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

కోడి పందేలకు రహస్య ఏర్పాట్లు..!



చీరాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి కోడి పందేలు వేసేందుకు పలు గ్రామాల్లో రహస్య ఏర్పాట్లు చేస్తున్నారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని తీరప్రాంత గ్రామాలు, చీరాల మండలం గవినివారిపాలెం, కావూరివారిపాలెం, తోటవారిపాలెం శివారు ప్రాంతాల్లో కోడి పందేల నిర్వహణకు సంబంధించి రహస్య ప్రదేశాలను అనువుగా తయారు చేసుకున్నట్లు విషయం తెలిసిన వారు చెప్తున్నారు. అయితే పందేలలో పాల్గొనే వారికి మాత్రమే సమాచారం ఉంటుందని, లేదంటే పోలీసులు పట్టుకుంటారనే జాగ్రత్తలు పక్కాగా తీసుకుంటున్నారు. ఇప్పటికే నిర్వాహకులు పందేలలో పాల్గొనేవారికి ఎక్కడ ఏ ప్రదేశంలో ఎన్ని గంటలకు పందేలు నిర్వహిస్తారనే సమాచారం పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత పటిష్టమైన నిఘా, చర్యలు చేపట్టి కోడి పందేలను అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు.



హ్యాండిక్రాఫ్ట్‌లో ప్రతిభ చూపిన లలితాంబికకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి స్వామి

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సూచించారు. ఆయన బోధనల నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కొత్తపట్నం బస్టాండులోని ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి మంత్రి స్వామి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అందుకోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబ ఇటీవల ప్రకటించిన విజన్ డాక్యుమెంట్‌లో కూడా యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన, ప్రతి ఇంటి నుంచి ఒకపారిశ్రామిక వేత్త తయారయ్యేలా ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌షా, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవంలో పాల్గొని ప్రతిభ చూపిన వారికి మంత్రి ప్రశంసాపత్రాలను అందజేశారు.

వివేకానందుని మాటలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే కొండయ్య



వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : సమాజ జాగృతికి, ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు శ్రమ నీ ఆయుధం అయితే ... విజయం నీ బానిస అవుతుంది లాంటి స్వామీ వివేకానంద మాటలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఎంఎం కొండ య్య అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం ఆర్డీవో కార్యాలయం సమీపంలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ పరమహంసకు ప్రియ శిష్యునిగా వివేకానంద వేసిన అడుగులు, చేసిన ఉపన్యాసాలు అనుక్షణం సమాజ హితాన్నే కోరాయన్నారు. కార్యక్రమంలో వివేకా నం సేవా సమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య, పలువురు రొటేరియన్లు, టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పలు సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

యద్దనపూడి : పూనూరు గ్రామంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను గ్రామస్థులు నిర్వహించారు. కస్పా చెరువు గట్టు మీద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అన్నమనేని వెంకటేశ్వరరావు, ఆదిశైవ సంఘ ప్రధాన కార్యదర్శి మూలంరాజు రాజకుమారుశర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు చెరుకూరి రాఘవచౌదరి, మధు, కొప్రపాటి శివ ప్రసాద్, బత్తుల కోటేశ్వరరావు, గన్నమనేని సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణాలపై దృష్టి

పర్చూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునఃనిర్మాణం చేసేలా దృష్టి సారించాలని, అలాంటి ఆలయాల జాబితాను తయారు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి దేవదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావుకు సూచించారు. ఆదివారం పర్చూరులోని శ్రీభీమేశ్వరస్వామి ఆలయాన్ని ఏలూరి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారి నాగేశ్వరరావు ఏలూరిని ఘనంగా సత్కరించారు. పర్చూరు, యద్దనపూడి, మార్టూరులోని శిథిలావస్థకు చేరిన ఆలయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక దర్శిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తొలిదశలో పునః నిర్మాణం చేస్తామని ఈవో తెలిపారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

» ఎమ్మెల్యే ఏలూరి

» రూ.కోటి వ్యయంతో నిర్మించిన మహాప్రస్థానం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (ఇన్‌సెట్‌లో) శివలింగాన్ని ప్రారంభిస్తున్న ఏలూరి

పర్చూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరులో రూ.కోటి వ్యయంతో దాతల సహకారం, ఎమ్మెల్యే ఏలూరి సౌజన్యంతో నిర్మించిన హిందూ శ్మశానవాటికను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. మహాప్రస్థాన కమిటీ అధ్యక్షుడు కఠారి సురేంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ దాతల సహకారం, గ్రామస్థుల ఐక్యతకు ఈ శ్మశానవాటిక నిదర్శనమన్నారు. ప్రజల చివరి మజిలీ ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని వసతులతో శ్మశానవాటిక నిర్మాణానికి కమిటీ కృషిని ఆయన అభినందించారు. మహాప్రస్థానం అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన కఠారి శ్రీకృష్ణ జ్ఞాపకార్థం కుమారుడు డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, ధర్మపత్ని కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి చూపిన చొరవను ఏలూరి కొనియాడారు. దాతల నుంచి విరాళాలను సేకరించి శ్మశానాన్ని అభివృద్ధి చేసిన కఠారి సురేంద్రబాబును అభినందించారు. అనంతరం రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధిలో ఎమ్మెల్యే ఏలూరి సహకారం ఎనలేనిదన్నారు. అనంతరం శ్మశానవాటికలోని వివిధ భవనాలు, శిలాఫలకాలను ప్రారంభించిన ఏలూరి అక్కడ ఏర్పాటు చేసిన మహాశివుని విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర్, పల్లా గిరిజారాయుడు, నర్రా వెంకట్, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, కోట హరిప్రసాద్, ఒగ్గిశెట్టి నరసింహం, కొల్లా వెంకన్న, మంగళగిరి కోటేశ్వరరావు, రావి సత్యనారాయణ, గడ్డిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా శ్మశానం తనను కలచివేసింది

డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు

'డంపింగ్ యార్డులా శ్మశాన వాటిక' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం తతను కలచివేసిందని, చివరి మజిలీ అయిన మహాప్రస్థానాన్ని తన తండ్రి జ్ఞాపకార్థం తాను భాగస్వామ్యం కావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. దాతల సహకారం, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని రమేష్ అన్నారు.

గోదాదేవికి సారె సమర్పించిన భక్తులు

చినగంజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలోని గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించే సారెను, అమ్మవారి చిత్రపటంతో గ్రామ పుర వీధులలో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా దేవస్థానంలోని అమ్మవారికి విశేష పూజలు జరిపి, అనంతరం తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు



వేటపాలెం(చీరాల), జనవరి 12(ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు స్వామివార్లకు ప్రత్యేక నైవేదాల్యను నివేదించి పారాయణం చేశారు. ఉభయ దాతలు ప్రత్తి వెంకటసుబ్బారావు, అనంతలక్ష్మి దంపతు లు, అనంగనాగసాయి, మల్లిక దంపతులు పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.



బాపయ్య కళాశాలలో కలిసిన 1998-99 పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

వేటపాలెం(చీరాల), జనవరి 12(ఆంధ్రజ్యోతి) : బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల 1998-99లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలిశారు. ఆనాటి స్మృతులను మననం చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు (పర్చూరు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కారంచేడు గ్రామంలోని డి.రామానాయుడు ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీలను ఏలూరి, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర్‌తో కలసి ప్రారంభించారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పలు కుటుంబాలను ఆదివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. మండలంలోని కలవకూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తన్నీరు ఏడుకొండలు కుటుంబసభ్యులను రవికుమార్ పరామర్శించారు. శింగరకొండలో పూజారి కోట శ్రీరామచంద్రమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబసభ్యులను మంత్రి రవికుమార్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడు పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 1వ వార్డులోని దామావారిపాలెంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేముల ప్రసన్నబాబు, 7వ వార్డులోని నర్రావారిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన మాదాల రామాంజనేయులు మాతృమూర్తి శేషమ్మ, 8వ వార్డులోని నర్రావారిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన పరిటాల ఆదినారాయణ తండ్రి హనుమంతరావు, 16వ వార్డు భాగ్యనగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు టీవీ నరసింహారావు, 17వ వార్డు పెరికపాలెంలో ఇటీవల మృతి చెందిన మద్దా ఆంజనేయులు మాతృమూర్తి నాగేశ్వరమ్మ, 18వ వార్డు కట్టకిందపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన వాగుమడుగు హరే రాంబాబు భార్య శింగమ్మ, 19వ వార్డు దామావారిపాలెంలో ఇటీవల మృతి చెందిన బొర్రా పున్నయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినన 7వ వార్డు నర్రావారిపాలెంకు చెందిన నర్రా శివయ్య, 17వ వార్డు పెరికపాలెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సన్నెబోయిన చిన్నమ్మ, కోటేశ్వరమ్మను మంత్రి పరామర్శించారు.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

బల్లికురవ : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పల్లపు ఆంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి గొట్టిపాటి అన్నారు. మండలంలోని అంబడిపూడిలో పల్లపు ఆంజనేయులు ఇల్లు ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఆదివారం మంత్రి రవికుమార్ పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ మండల నేతలు కొండేటి ఇజ్రాయిల్, దద్దాల అంజయ్య ఉన్నారు.

పంగులూరు : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు గ్రామాలలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. రేణంగివరంలో మరణించిన సంపతి రోశయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. ఇదే గ్రామంలో ఈ నెల 2న గుండెపోటుతో మరణించిన మట్టకొయ్య వక్కియ్య నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ నెల 3న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన అన్నపు రెడ్డి వెంకటకృష్ణారెడ్డి నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముప్పవరంలో మృతి చెందిన ధూళిపాళ్ల నాగరత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట నేతలు బొరెడ్డి ఓబులరెడ్డి, మాజీ సర్పంచ్ అమృతపూడి ఏసోబు, ఎర్రం శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

భోగిళ్లో.. భోగిళ్లు



తెలుగువారి పెద్ద పండుగ వచ్చేసింది. ఏడాది పొడవునా ఎన్ని పండుగలు వచ్చినా సంక్రాంతికి సాటి రాదేది. అందుకే ఇది మనందరి పే...ద్ద పండుగ. ఇందులోనే పెద్దల పండుగ కూడా!. భోగితో మొదలై సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పారువేట, ఏటి పండుగలతో జిల్లాలో ఐదురోజులు సందడే సందడి. చదువు, ఉద్యోగం, వ్యాపారం కోసం దేశ విదేశాల్లో ఉన్నవారంతా ఒక్కచోటికి చేరే సమయం. సామాన్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరూ పెద్ద పండుగను సొంత ఊళ్లో జరుపుకోవాలనుకుంటారు. అందుకనే పట్టణాల్లో బతుకుతున్న వారంతా పల్లె బాట పట్టారు. రోడ్లపై వాహన ప్రవాహం కనిపిస్తోంది. ఏ బస్సు చూసినా, ఏ రైలెక్కినా కిటకిటే!. అయినా అదొక కమ్మని అనుభూతి. పుట్టిపెరిగిన ఊరికి వెళుతున్నాం... ఆత్మీయులతో పండుగ జరుపుకోబోతున్నామనే ఆనందం. ఇక, సంక్రాంతి ప్రత్యేకం పిండి వంటలు. ఏ ఇంటి ముందు నుంచి వెళుతున్నా అరిసెలు, కజ్జికాయలు, మణుగుబూల గుభాళింపే. కొత్త అల్లుళ్లు అత్తగారిళ్లకు చేరి సందడి చేస్తున్నారు. ఆడపిల్ల లు అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా పావడా పరికిణీ, లంగావోణీల్లో ఇళ్లకు కొత్త కళ తెస్తున్నారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు... వెరసి సంక్రాంతికి జిల్లా సిద్ధమైంది.

నెల్లూరు : టీడీపీ కార్యాలయం ముందు వేసిన భోగి మంట

- నేడు భోగభాగ్యాల భోగి
- సంక్రాంతి సంబరాలు ఆరంభం
- జిల్లాలో ఐదు రోజులు సందడి
- పల్లెలకు కదిలిన పట్టణాలు

సంక్రాంతి సంబరాల్లో తొలిరోజు భోగి పండుగ. ఇళ్ల ముంగిట మంటలు వేసి చిన్నా పెద్దా సందడి చేసే వేడుక. భోగ భాగ్యాలను ఇచ్చే పండుగగా దీనిని జరుపుకుంటారు. ఈ పండుగ రోజు ధనుర్మాసం ముగుస్తుంది. దీంతో ఆలయాల్లో భోగి కల్యాణాలు నిర్వహి స్తారు. పసిపిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వ దిస్తారు. భోగి మం టల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల కాలుష్యం పెరిగి వాతావరణం కలుషితమవు తుంది. పర్యావరణానికి ఉపయోగపడే పిడకలు, కలపను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. భోగి పండుగ సందర్భంగా కొన్ని కుటుంబాలు గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి గొబ్బి నోము నోచి ఏటి పండుగ రోజు నదీజలాల్లో ఓలలా డిస్తాయి. మరికొందరు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి గౌరీ దేవివి పూజించి రాత్రివేళ పేరంటాళ్లకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు అందుకుంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయి. అయితే ఈ పండుగకు నిత్యావసర సరుకుల ధరలు గత ఏడాది కంటే 20 శాతం పెరిగాయి. వంట నూనెలు పిండి వంటలు చేయకుండానే కాగుతున్నాయి. ఇక, భోగికి అవసరమైన తాటి ఆకులు, తేగల ధరలు కూడా భగ్గుమంటున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : కొనుగోలుదారులతో కిక్కిరిసిన ట్రంకురోడ్డు

పండుగ అతిథులు.. అదృశ్యం

- కానరాని డూడూ బసవన్నలు, జంగమ దేవర్లు
- కాటికాపరి, హరిదాసులదీ అదేదారి
- ఆదరణ లేక ప్రత్యామ్నాయ ఉపాధి వైపు అడుగులు



నెల రోజులపాటు ఎంతో ఆర్భాటంగా జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి. ఈ మాసంలో ప్రతి రోజూ మన సంప్రదాయాలను గుర్తు చేస్తూ హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల గెంతులు ఆకట్టుకునేవి. ఇక జంగమదేవరలు, కాటికాపర్ల వేషధారణ చూసి ఒళ్లు గగుర్పొడిచేవి. కానీ ఇప్పుడు వీరంతా కనుమరుగయ్యారు. పల్లెల్లో ఆదరణ తగ్గడం.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ వృత్తుల్లో స్థిరపడిపోయారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

● కాటికాపర్లు ఏరీ!?

ఒంటిపై పంచె, నల్లని చొక్కా, తల మీద ఇత్తడి కిరీటం, నుదుటున ఎర్రని పెద్ద బొట్టు, బొర్ర మీసాలు, జు ట్టు పెంచుకుని, కళ్లకు కాటుక, మెడ లో పెద్ద రుద్రాక్ష దండలు, చిన్న చిన్న గంటలు, సంకలో జోలె, అందులో ఎముకలు, బొమ్మలు, పూసలు, ఇతర సామగ్రి, చేతిలో పెద్ద గంట, గవ్వలు, తాళ్లపత్ర గ్రంథం, వీపున జంతు చర్మంతో భీతిగొలిపేలా గాంభీరమైన వస్త్రాధారణ. వీరినే కాటికాపరులు అంటారు. నాడు పల్లెల్లో భిక్షాటన చేస్తూ కనిపించేవారు. నిరాశి అనే పేరుతో ఒకరి ప్రాంతంలో మరొకరు వెళ్లకుండా కట్టుబాట్లు ఉండేవి. సంక్రాంతికి నెలరోజుల ముందు నుంచి పండుగ ముగిసే వరకు తమ పరిధిలోని ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి ధాన్యం, పప్పులు, బట్టలు, వస్త్రాలు, నగదు, పిండి వంటలు తీసుకునేవారు. అయితే, వీరిపై పల్లెల్లో ఆదరణ తగ్గిపోవడంతో అంతా ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. సంచార జీవులుగా ఉన్నవీరంతా ఇప్పుడు ఎక్కడెక్కడో స్థిరపడి పోయారు.



ఒంటినిండా నల్లటి దుస్తులు.. తలకు పాగా.. నుదుటున విబూదితో నామాలు... ఒకచేతిలో గంట.. మరోచేతిలో శంఖు, బుజాన కావడి లేదా జోలే పట్టి శివ స్తుతి చేస్తూ గంట వాయిస్తూ, మధ్య మధ్యలో శంఖాన్ని ఊదుతూ ప్రతి ఇంటి ముందు జంగమదేవరలు ఆగుపించేవారు. బియ్యం లేదా నగదు, ఇతర వస్తువులు ఇస్తే స్వీకరించే వెళ్లేవారు. కానీ ఇప్పుడు వీరంతా కనుమరుగయ్యారు. సమాజంలో వచ్చిన మార్పులతో జంగమ దేవర ఇళ్లలోని పిల్లలు చదువుకుని ఉద్యోగాలు, వ్యవసాయం వంటి ఇతర వృత్తుల్లో స్థిరపడిపోయారు. ఒకప్పుడు సంగం మండలంలోని చెన్నవరపాడులో గ్రామమంతా జంగం కులస్థులే ఉండేవారు. 20 ఏళ్ల కిందట సంక్రాంతి నెల వచ్చిందంటే వీరంతా ఉత్తరాది జిల్లాలకు వెళ్లి అక్కడ జంగమ దేవర వేషధారణలో పల్లెల్లో తిరిగి నాలుగు రూపాయలు సంపాదించి పండుగ తర్వాత తిరిగి సొంతూరికి వచ్చేవాళ్లు. ఇప్పుడు ఆ గ్రామంలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఆ వృత్తిలో లేరు. అంతా గౌరవప్రదమైన వృత్తిలో ఉంటున్నారు.

● కానరాని డూడూ బసవన్నలు

'అమ్మగారికి దండం పెట్టు, అయ్యగారికి సలాం కొట్టు..' అంటూ పల్లెలో డూడూ బసవన్నల (గంగిరెద్దులు) సందడి కనిపించేది. వీటి వెంటే వీధుల్లో పిల్లలు గుమికూడి అల్లరి చేసేవారు. కానీ ఇప్పుడు గంగిరెద్దులు కనిపించడం లేదు. అక్కడక్కడా ఉన్నా నాటి సందడి లేనేలేదు. వృత్తి గిట్టుబాటుకాక చాలా మంది ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్లిపోయారు. కొత్తగా ఈ వృత్తిని స్వీకరిస్తున్నవారూ లేరు.

● హరిదాసులదీ అదేదారి

తెల్లవారుజామునే ప్రతి ఇంటి ముందు పాటలు పాడుతూ హరిదాసులు కనిపించేవారు. బియ్యం, నగదును హరిదాసుల తలపై ఉన్న పాత్రలో వేసేవారు. నేడు ఎక్కడా హరిదాసులుగాని, కీర్తనలుగాని వినిపించడంలేదు. కొత్తగా హరిదాసు వేషధారణ వేసి పల్లెలకు వచ్చేవారూ లేరు. ఒకరిద్దరు ఉన్నా వయసు పైబడటంతో ఇంటివద్దనే ఉంటున్నారు.

నాటి సంక్రాంతి రోజులే వేరు



మా రోజుల్లో పెద్దపండుగ (సంక్రాంతి) నెల వచ్చిందంటే ఒకటే సందడి. ఎవరి ఇంటిలో చూసినా హడావుడి ఉండేది. ఆడోళ్లంతా ఇంటిని చక్కదిద్దే పనిలో పడేవారు, మగవారు పొలం పనులతో బిజీగా గడిపేవారు. పూరిపాకల గోడలకు పేడ దిద్ది సున్నం వేసి, ఎర్రమట్టి చారలతో సుందరంగా అలంకరించేవారు. పెద్ద కుటుంబాలైతే భవంతులకు సున్నాలు వేసేవారు. కానీ ఇప్పుడు కార్యాలయితే తప్ప సంక్రాంతిని పండగలా చూడటంలేదు. పల్లెల్లో కూడా చూద్దామన్నా ఇంటికి రంగులేసేవారు కనిపించడంలేదు.

- చలమయ్య, అన్నారెడ్డి పాలెంవాసి

నిప్పట్ల ఘుమఘుమలు

● ఏ ఇంట చూసినా పిండి వంటలే ● పట్టణాల్లో 'రెడీమేడ్'



ఉదయగిరిలో పిండివంటలు చేస్తున్న ఓ కుటుంబం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ చూసినా సంక్రాంతి పిండివంటల ఘుమఘుమలే!. పెద్ద పండుగ సంప్రదాయాలకే కాదు పిండి వంటలకూ ప్రసిద్ధి. అందుకనే ఏ ఇంటికి వెళ్లినా పిండి వంటల సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా పల్లెల్లో నిప్పట్లు అని పిలుచుకునే అరిసెలు సంక్రాంతికే స్పెషల్. ఇవి ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. అందుకని పిండి వంటల్లో ఇవి ఉండి తీరాల్సిందే. బెల్లం అరిసెలతోపాటు చక్కెర అరిసెలు, నేతి అరిసెలు కూడా చేస్తున్నారు. ఎక్కువ మంది సభ్యులున్న కుటుంబాల్లో అందరూ కలిసి తీరిక చేసుకుని పిండి వంటలు తయారు చేస్తున్నారు. చిన్న కుటుంబాల వారైతే ఇద్దరు ముగ్గురు కలిసి రకరకాల పిండి వంటలు చేసుకుంటున్నారు. నిప్పట్ల తర్వాత మణుగుబూలు, చెక్కలు, కజ్జికాయలు, లడ్డూలను ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. ఇక, పట్టణాల్లో ఉరుకులు పరుగుల జీవితాల్లో టిఫిన్లు, భోజనాల్లాగే సంక్రాంతి పిండి వంటలను కూడా రెడీమేడ్‌గా తెచ్చేసుకుంటున్నారు. వీరి కోసమే అన్నట్లు ఆర్డర్లపై పిండి వంటలను పలు హోటళ్లు, మెస్‌లు, స్వీట్ స్టాళ్లు, క్యాటరింగ్ పాయింట్ల వారు రుచికరంగా అందిస్తున్నారు. కొన్ని చిన్న కుటుంబాలు స్వయం ఉపాధి కోసం ఆర్డర్లపై పిండివంటలు చేసిస్తున్నాయి. ఇలా వెళ్లి... అలా తెచ్చుకుని పండుగ చేసేసుకోవడమే!.



ఉదయగిరి : నిర్మానుష్యంగా ఉన్న గంగిరెడ్డిపల్లి ప్రధానవీధి

పల్లెకేదీ.. పండగ



వెంకట్రావుపల్లిలో వృద్ధులే దిక్కు

ఉదయగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందడి అంతా పల్లెలదే. బంధు మిత్రులతో ఎంతో ఉల్లాసంగా జరుపుకునే పండుగ ఈసారి గ్రామాల్లో బోసిపోయింది. జిల్లాలోని మెట్ట ప్రాంత పల్లెల్లో సంక్రాంతి కళ కనిపించడం లేదు. మూడేళ్లుగా వరుణుడు వర్షించక పోవడం, మోటార్లు, బావుల కింద సాగు చేసిన పంటలు దెబ్బతినడం, పంట చేతికొచ్చినా ధర లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. మరోవైపు సేద్యపు ఖర్చులు పెరగడంతో సిరులు పండే భూముల్లో చిల్లచెట్లు దర్శనమిస్తున్నాయి. ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేతపట్టుకొని పొరుగూళ్లకు వెళ్లిపోయారు. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి అధిక శాతం మంది బెంగళూరు, చెన్నై, పూణే, గోవా, మహారాష్ట్ర, హైదరాబాదు, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. కొన్ని పల్లెల్లో వృద్ధులు మాత్రమే మిగిలారు. పెద్ద పండక్కి అయినా ఆత్మీయులు వస్తారని గంపెడాశతో ఉన్న వారికి నిరాశే మిగిలింది. రానుపోను చార్జీలు, పండగ ఖర్చులు ఇలా ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాలేకపోతున్నట్లు వారు చెప్పడంతో లోలోన కుమిలిపోతున్నారు. దీంతో పల్లెల్లో పండగ సందడే కరువైంది.

పండగ కళే లేదయ్యా!



ఏందో అయ్యా.. ఈసారి మా ఊళ్లో పండుగ కళే లేదు. పని కోసం వెళ్లినవారంతా పండక్కి రావడం లేదని చెప్పారు. చార్జీలు, ఖర్చులు బాగా పెరిగి పోయాయి. రానుపోను దాదాపు రూ.10వేల దాకా ఖర్చవతాది. అందుకే రామని చెప్పేశారు. ఈ పండక్కి ఊళ్లో ఉన్నవారితోనే గడుపుకోవాల్సి వస్తోంది.

- కమలకూరి కృష్ణారెడ్డి, గంగిరెడ్డిపల్లి

పిల్లల్లేకుండా పండగేందినాయన!



అరకొరగా ఉన్న భూమి సక్రమంగా పండక, ఉన్న ఊరిలో ఉపాధి కరువై నా ముగ్గురు కుమారులు బేల్దారి, ఇతరత్రా పనుల కోసం బెంగళూరు వెళ్లారు. అక్కడ కూడా పని సరిగ్గా లేదట. పండక్కి ఊరికి వచ్చేందుకు కూడా చేతిలో డబ్బుల్లేక అక్కడే ఉండి పోయారు. పిల్లల్లేకుండా పండగ ఏం చేసుకోవాలయ్యా. అనారోగ్యంతో బాధపడుతున్న నా భర్త, నేను ఏం పండుగ చేసుకుంటాం చెప్పు.

- బొందికాళ్ల చెంచమ్మ, వెంకట్రావుపల్లి

కోడిపందేల జోరు

- సిఫారసుల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్!



ఉదయగిరి రూరల్ : మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో కోడిపందేల నిర్వహణకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొంతమంది సిఫారసుల కోసం రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదయగిరి మండలంలోని దుంపవారిపల్లి, గుడినరవ, జీ.చెరువుపల్లి తదితర గ్రామాల్లో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే వరికుంటపాడు మండలం నల్లబోతులవారిపల్లి, తూర్పురొంపిదొడ్ల, కాంచెరువు, తూర్పుబోయమడగల, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుపాళెం, సీతారామపురం మండలం బసినేనిపల్లి, పబ్బులేటిపల్లి, గుండుపల్లి, చిన్నాగంపల్లి, సీతారామపురం, సింగారెడ్డిపల్లి, వింజమూరు మండలంలోని కాటేపల్లి, రావిపాడు, కోకావారిపాళెం, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో పందేలు కొనసాగే అవకాశం ఉంది. పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా నిర్వాహకులు మాత్రం డోంట్ కేర్ అంటూ తమ పంతాన్ని నెగ్గించుకొనేందుకు తమదైన శైలిలో పావులు కదులుపుతున్నారు.

● ఆత్మకూరు, : ఆత్మకూరు సర్కిల్ పరిధిలో కోడిపందేల నిర్వాహకులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీచేశారు. జూదగాళ్ల జాబితాను సిద్ధంచేసి వారిపై నిఘా పెట్టడంతోపాటు గతంలో గుర్తించిన కోడి పందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదుకూ వెనకాడబోమని స్పష్టం చేశారు. అలాగే పలు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

పోలీసులకు 'సంక్రాంతి కానుక'

● రూ.7.93 కోట్ల బకాయిల చెల్లింపునకు ఆదేశాలు

నెల్లూరు(క్రైం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగకు తీపి కబురు వినిపించింది. గత ప్రభుత్వ పాలన నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలకు వెంటనే నిధులు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 2,162 మందికి సరెండర్ లీవ్ బిల్లు బకాయిల కింద రూ.7.93 కోట్ల నగదు విడుదల కానుంది. దీంతోపాటు జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు విడుదల అవుతాయి. ప్రభుత్వ ప్రకటనతో పోలీసు కుటుంబాల్లో ఆనందం నిండింది. రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

నకిలీ సిగరెట్ల గుట్టు.. రట్టు

- ఉత్తరాది నుంచి దిగుమతి
- చెన్నై కేంద్రంగా వ్యాపారం
- విజిలెన్స్ బృందాల దాడి
- రూ.2.21 కోట్ల సరుకు స్వాధీనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/కోవూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ సిగరెట్ల గుట్టును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరం రామలింగాపురంలోని ఓ గోదాము, ఇనుమడుగులోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో దాడులు చేశారు. రూ.2.21 కోట్లకుపైగా విలువ చేసే సరుకును స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నైకు చెందిన కమల్ తివారి సిగిరెట్ల వ్యాపారి. నెల్లూరు బాలాజీ నగర్‌కు చెందిన జగదీష్ ఆయన వద్ద మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కమల్ తివారి బిహార్‌తోపాటు ఉత్తరాది రాష్ట్రాలనుంచి వివిధ ట్రాన్స్‌పోర్టుల ద్వారా ప్రముఖ బ్రాండ్లను పోలి ఉండే నకిలీ సిగిరెట్లను నెల్లూరుకు దిగుమతి చేస్తున్నారు. మేనేజర్ జగదీష్ వాటి ని జిల్లాలోని బడ్డీకొట్లు, సిగిరెట్ల విక్రయ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందడంతో వారి ఆదేశాల మేరకు నెల్లూరు విజిలెన్స్ ఎస్పీ రాజేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు నరసింహారావు, సుభాన్, డీసీటీవో విష్ణురావు, సిబ్బంది ఆదివారం రామలింగాపురంలోని గోదాము, ఇనుమడుగులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో దాడులు చేశారు. రామలింగాపురంలోని గోదాములో రూ.1,73,59,000 కోట్ల విలువ చేసే రాయల్స్, జీటీపీఎల్, విమల్, గోల్డ్‌స్టాగ్, ప్లాటినమ్, ప్యారీస్‌తో పాటు పలు కంపెనీల పేర్లతో ఉన్న 3,31,100 సిగిరెట్ పెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. ఇనుమడుగులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో రూ.47.52 లక్షల విలువ చేసే 1,18,800 సిగిరెట్ పెట్టెలను స్వాధీనం చేసుకుని మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సరుకును, మేనేజర్‌ను తదుపరి దర్యాప్తు నిమిత్తం బాలాజీ నగర్ పోలీసులకు అప్పగించారు.



నకిలీ సిగరెట్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు



నెల్లూరు రామలింగాపురంలో పట్టుకున్న నకిలీ సిగరెట్లు



ఇనమడుగులో సిగరెట్ల బాక్సులను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

రెడ్‌క్రాస్ సభ్యులకు కలెక్టర్ నోటీసులు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీలో రాజకీయ పార్టీలకు సంబంధమున్న పలువురికి కలెక్టర్ ఆనంద్ ఆదివారం నోటీసులు జారీ చేశారు. నిబంధనల అతిక్రమణపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా తదనంతరం చర్యలు ఉంటాయని తెలిపారు. కాగా, ఇప్పటికే రెడ్‌క్రాస్ ఛైర్మన్ పదవికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి రాజీనామా చేయగా, మరికొంత మంది సభ్యులు రాజకీయ పార్టీల్లో ఉన్నట్టు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ నోటీసుల జారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

సోమశిలలో 70.720 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 2,276 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు ఇంజనీర్లు తెలిపారు. దీంతో జలాశయంలో 70.720 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు. ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, తెలుగు గంగ వరద కాలువకు 200, పెన్నా డెల్టాకు 2,650 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

తీరప్రాంత అభివృద్ధికి

ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి రూరల్, జనవరి12(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తుమ్మలపెంట, అన్నగారిపాలెం పంచాయతీల్లోని గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కొత్తసత్రం దళితవాడలో సీసీ రోడ్డు నిర్మాణం, చినరాముడుపాలెం బీచ్ రోడ్డు, తుమ్మలపెంట, పల్లెపాలెం లో సీసీ రోడ్లు, రెసిడెన్షియల్ స్కూల్ రోడ్డు, తుమ్మలపెంట బీచ్ రోడ్డుకు ఆయన భూమిపూజ చేశారు. అలాగే నడింపల్లి నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పాత పట్టపుపాలెం లో సీసీ రోడ్డు, ఒట్టూరులో సీసీ రోడ్డు, వెంకటేశ్వరపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అన్నగారిపాలెం సర్పంచి గోళ్ల సుప్రియ, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, టీడీపీ నేతలు ఆవుల రామక్రిష్ణ, పాలడుగు రంగారావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● క్రీడాపోటీల ప్రారంభం

కావలి: పట్టణంలో పలు క్రీడా పోటీలను ఆదివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభించారు. వైకుంఠపురం యూత్ ఆధ్వర్యంలో వైకుంఠపురంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారితో కలిసి సరదాగా కొంతసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. అలాగే గుర్రం పెట్రోల్ బంకు వెనుక కేకేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నీస్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు.

కూటమి ప్రభుత్వంలో కష్టజీవులకు న్యాయం

● ఎమ్మెల్యే ఇంటూరి



108 సిబ్బందికి కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కష్టాన్ని గుర్తించి వారికి న్యాయంచేసే ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. 108 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బందికి రూ. 4వేలు వేతనం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటూరికి 108 సిబ్బంది ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. జీతం పెంచిన సందర్భంగా ఎమ్మెల్యేతో కేకు కట్ చేయించారు. కార్యక్రమంలో డాక్టరు ఇంద్రాణి, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, మువ్వల భూషయ్య, శిగా తిరుపాలు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, చీదెళ్ల వేణుగోపాల్ పాల్గొన్నారు.

అనివేటి మండపం పనులు వేగవంతం చేయండి



యాలీస్తంభాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి మానుగుంట

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన అనివేటి మండపం పనులను వేగవంతం చేయాలని మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన అంకమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మండపం నిర్మాణాన్ని, యాలీ స్తంభాలను పరిశీలించి, సూచన లిచ్చారు. మండపం పనులతోపాటు ఆలయం పూర్తయిన పనులకు తుదిమెరుగులు దిద్దాలన్నారు. ఆయన వెంట అలయ కమిటీ సభ్యులు, శిల్పి శ్రీనివాస్ ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులరెడ్డి

అనంతసాగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను భారత్ మరియు మయన్మార్ దేశాల రాయబారి బీ శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆటలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఏలూరు ప్రసాద్, విశ్రాంత ఎంఈవో బాలకృష్ణారెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు, సభ్యులు వెంకటరమణారెడ్డి, కత్తి పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల ప్రారంభం

● ఆత్మకూరు : పట్టణంలోని ప్ర భుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముందుగా క్రీడాకారులు మున్సిపల్ బస్టాండ్ లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీగా క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. సీపీ ఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్ రాజు, డివైఎఫ్ఐ నాయ కులు పి జిలానిబాష, సీఐటీయు నాయకులు జి శివప్రసాద్ తదితరులు క్రీడాపోటీలను ప్రారంభించారు. అనతరం క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకుడు జి లక్ష్మీపతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని, సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి, డీవైఎఫ్ఐ నాయకులు ఆళ్ల హజరత్తయ్య. నందా శ్రీను, పయాజ్, మహేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల కంట్రోల్ వ్యవస్థ పరిశీలన



సీసీ కెమెరాల కంట్రోల్ వ్యవస్థను పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని సీసీ కెమెరాల కంట్రోల్ వ్యవస్థను ఆదివారం డీఎస్పీ కె వేణుగోపాల్ పరిశీలించారు. సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ వ్యవస్థ ద్వారా పట్టణంలోని ఏఏ ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేశారో పరిశీలించారు. సీసీ కెమె రాల ద్వారా పటిష్టమైన నిఘా ఉందని, నేరాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినందుకు సీఐ జి గంగాధర్, ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్‌లను ఆయన అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

జలదంకి, జనవరి12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు మెసేజ్‌లు, మోసపూరితమైన మాటలతో ఆశలు కల్పించి మోసం చేస్తారని ఎస్ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు. అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం ఆమె జలదంకి బస్టాండు కూడలిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటీపీ చెప్పమని తెలియని ఫోన్‌నెంబరు నుంచి ఎవరైనా అడిగితే చెప్పకూడదని అన్నారు. సంక్రాంతి పండుగకు ఎవరైనా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట లాంటి ఆడితే తమకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లతీఫున్నీసా

సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం

● బంధువుల రాకతో గ్రామాల్లో సందడి ● పిండివంటల ఘుమఘుమలు ● కిటకిటలాడుతున్న దుకాణాలు ● భోగికి ఏర్పాట్లు



ఆత్మకూరులో రద్దీగా ఉన్న వస్త్రదుకాణాలు



సంగం: పిండి వంటలు చేస్తున్న కుటుంబ సభ్యులు



బిట్రగుంట: భోగి మంటకు తాటాకు తీసుకెళ్తున్న యువకుడు

ఆత్మకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి శోభ నెలకొంది. దూరప్రాంతాల నుంచి బంధువుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. విద్యార్థులు సంక్రాంతి సెలవులకు గ్రామాలకు వచ్చి కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతున్నారు. ప్రతి ఇంట్లో పిండివంటల ఘుమఘుమలు గుప్పుమంటున్నాయి. ఆత్మకూరు పట్టణంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సందడి నెలకొంది.

కిటకిటలాడుతున్న వస్త్ర, చిల్లర దుకాణాలు

కొనుగోలుదారులతో వస్త్ర, చిల్లర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల నుంచే కాకుండా ఏఎస్‌పేట, చేజర్ల, అనంతసాగరం మండలాలకు చెందిన ప్రజలు ఆత్మకూరు పట్టణంలో పలు వస్తువులు కొనేందుకు రావడంతో దుకాణాలు రద్దీగా మారాయి. భోగిమంటలు వేసేందుకు యువకులు తాటాకులు, వివిధ సామాగ్రిని సమకూర్చుకున్నారు. కోళ్ల దుకాణాల వద్ద, వస్త్రదుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

● సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి మంటలకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచే యువకులు భోగి మంటలకు కావలసిన తాటాకు, కంప తదితర సామాగ్రిని సిద్ధం చేశారు. అర్ధరాత్రి కాగానే భోగి మంటలు వేసేందుకు సర్వ సిద్ధం చేశారు. చికెన్ దుకాణాలు కళకళ లాడాయి.

●ఉదయగిరి: ఉదయగిరి పట్టణంలో ఆదివారం సంక్రాంతి శోభ నెలకొంది. దుస్తులు, నిత్యావసర వస్తువుల దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. మరోవైపు మహిళలు నివాసాల్లో పిండి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. అన్నిరకాల నిత్యావసర వస్తువులు, దుస్తుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

సీతారామపురం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో సందడి నెలకొంది. దూర ప్రాంతాలలో ఉంటున్న బంధువులు సొంత ఊర్లు చేరుకుంటున్నారు. పిండి వంటలతో ప్రతి ఇల్లు ఘుమ ఘుమలాడుతోంది. భోగి మంటలకు తాటాకులను సిద్ధం చేసుకున్నారు.

● బిట్రగుంట : గతంలో భోగి పండుగ వస్తుందంటే పల్లెల్లో రెండు వారాల ముందే వెంపలచెట్లు, ముళ్లకంప కొట్టుకొచ్చి గుట్టలు వేశారు. అవి ఎండాక భోగి మంటలోల వేసేవారు. కాలం మారే కొద్ది పట్టణాల్లో చదువుకుంటున్న యువత కొందరు సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వచ్చి సమయం లేకపోవడంతో తాటాకు మోపులతోనే పండుగ చేసుకుంటున్నారు. దీంతో తాటాకుకు డిమాండ్ ఏర్పడింది.

●కలిగిరి : భోగిని పురస్కరించుకొని మండలంలోని ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్నారులు, యువకులు ఆదివారం పొలాల వద్దకు వెళ్లి తాటాలను ఆటోల్లో ఇళ్లకు తరలించారు. ప్రతి కుటుంబంలో పిండివంటలు చేసుకుంటూ కనిపించారు. దూరప్రాంతాల వారు గ్రామాలకు రావడంతో పండగ వాతావరణం నెలకొంది.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



కావలి : వివేకానందుడికి నివాళులు అర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం వివేకానంద విగ్రహ కమిటీ బాధ్యులు, రెడ్‌క్రాస్ బాధ్యులు వేర్వేరుగా నిర్వహించారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ట్రంకు రోడ్డులో ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, కమిటీ బాధ్యులు నారా మాలకొండయ్య నాయుడు, బొచ్చు వీరాస్వామి, చన్నా వెంకట్రామయ్య, మాలకొండారెడ్డి, బీజేపీ నేత కందుకూరి వెంకటసత్యనారాయణ, టీడీపీ నేతలు పోట్లూరి శ్రీనివాసులు, మోడరన్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ. రవిప్రకాష్, డాక్టర్ బెజవాడ రవికుమార్, కలికి శ్రీహరిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ముందుగాఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎన్.రాజ్యలక్ష్మి, నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి సూర్యం, పెంచలయ్య, రామ్‌చరణ్, హర్షవర్ధన్, కౌసిక్ పాల్గొన్నారు.

●సంగం : స్వామి వివేకానంద జయంతిని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు సురేంద్ర రెడ్డి, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల రోశయ్యయాదవ్, చల్లా సుబ్బరత్నం, మస్తాన్, దుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని గువ్వాడిలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోడెందుల సుధాకర్, యువ నాయకులు యాదగిరి ప్రభాకర్‌రావు, వంశీ, కేశవ, చెన్నారాయుడు, కిరణ్, లోకేష్, రవీంద్ర, సతీష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వింజమూరు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కందల మధు, పి వెంగయ్య, డేగ మధుయాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కప్పరాళ్లతిప్పలో ఎక్సైజ్ ర్యాలీ

బిట్రగుంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప, బాడన్‌పేటలలో ఆదివారం కావలి ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో నవోదయం-2.0పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు మండలంలోని కడనూతల, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం, తాళ్లూరు తదితర పంచాయతీల్లో నాటుసారా తయారీ కేంద్రాలను గాలించారు. అనంతరం నవోదయం 2.0పై స్థానికులకు వారు వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆకుల డేవిడ్‌పాల్, మేకల శ్రీనివాసులు, ఆవుల నాగేశ్వరరావు, నెల్లూరు, బుచ్చి, కలిగిరి సీఐలు కే.పీ.కిశోర్, ప్రసన్నలక్ష్మి, జలీల్‌ఖాన్, పాల్గొన్నారు.

అలరించిన పాటకచేరి

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీకేఆర్ అండ్ ఫ్రెండ్స్ మ్యూజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పాటకచేరి నిర్వహించారు. స్వరనివాళి పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వర్ధమాన గాయకులు పాడిన పాటలు శ్రోతలను అలరించాయి. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, గాయకుడు తురకా కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, దండోరా దాస్, మహమ్మద్ యూసుఫ్, చలంచర్ల సుబ్బారావు, వీ శరత్, ఆర్వీ రమేష్, విజయ్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

రిజ్వాన్‌కు సత్కారం

కావలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకుడు షేక్ రిజ్వాన్‌కు ఇటీవల చెన్నైలోని ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రిజ్వాన్‌ను వాయిస్ ఆఫ్ ముస్లి మైనార్టీ అధ్యక్షుడు మొఘల్ సలీంబేగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాష సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ పీ. శ్రీధర్, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డీ. రవిప్రకాష్, విట్స్ కళాశాల ప్రొఫెసర్ షేక్ రజ్వి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ ఖలీల్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ నవాజ్‌ఖాన్, విశ్రాంత అధ్యాపకులు ప్రసాద్‌రావు, ఘనీబాష పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

సీతారామపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో మాజీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసులు, తోట మనోహర్, రామిశెట్టి తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

● రైతుల ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టిం చి సాగు చేసిన వరి పంటకు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. దళారులు రైతుల దగ్గర నుంచి 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తుండంతో పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. కొంతమంది రైతులు పెట్టుబడులకు తెచ్చిన నగదుకు వడ్డీలు పెరిగిపోతుండడంతో గతిలేక వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేత ఖాదర్ మస్తాన్ సేవలు ఆదర్శనీయం

అనంతసాగరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నాయకుడు, దివంగత ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఖాదర్‌మస్తాన్ సేవలు ఆదర్శనీయమని జేవీవీ జిల్లా నాయ కులు గాడి సుధాకర్ తెలిపారు. ఖాదర్‌మస్తాన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం అనంతసాగరంలో ఆయన ఉత్తర క్రియలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో అబ్బాస్‌అలీ, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

పశుపోషకులకు గోకులం షెడ్లు ఓ వరం

వలేటివారిపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు పశు పోషకులకు ఓ వరమని ఉపాధి హమీ టెక్నికల్ అసిస్టెంట్ అశోక్ తెలిపారు. మండలంలోని పోకూరులో ఘట్టమనేని రమాదేవి నిర్మించుకున్న గోకులం షెడ్డును స్థానిక టీడీపీ నాయకులు ఎన్ రవీంద్ర, జీ హరికృష్ణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు ఎస్ తిరుమల, ఎం మాల్యాద్రి, జీ లక్ష్మీనరసింహం, ఏ వెంకటేశ్వర్లు, బీ నరసింహం, ఎన్ రమణయ్య, ఎన్ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మండలంలోని 43 మందికి రుణాలు అందించనున్నట్లు తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు



కలిగిరి: పందెం రాయుళ్లతో పోలీసులు

కలిగిరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు గుడ్లదొన అటవీ ప్రాంతంలో ఆదివారం కోడిపందేలపై పోలీసులు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4200 నగదు, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉమా శంకర్ తెలిపారు.

●వింజమూరు: ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ కె వీరప్రతాప్ తక్కెళ్లపాడు అటవీ ప్రాంతంలో కోడిపందాల స్థావరాలపై సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని 5 కోళ్లు, 26వేల 50 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

జూద స్థావరంపై దాడి

●సంగం : మండలంలోని తిరుమనతిప్పలో అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీ ఇళ్లలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం ఎస్ఐ రాజేష్ దాడిచేసి ముగ్గురు జూదగాళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1180 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల నమోదు

● ఎన్ వెంకటరావు, సీఐ, ఉదయగిరి



ఉదయగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు ఆదివారం సూచించారు. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేకాట, కోడి పందేల స్థావరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

? జూద స్థావరాలను అడ్డుకోగలరా.

! గ్రామాల్లో జూదాలకు, కోడి పందేల నిర్వహణకు ఎలాంటి అనుమతుల్లేవు. ఆ యా పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేశాం.

? చోరీల నియంత్రణకు చేపట్టిన చర్యలు ఏమిటి.

! ఉదయగిరి సర్కిల్ పరిధిలో చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం. పండుగ సమయం కావడంతో చైన్‌స్నాచింగ్ జరిగే అవకాశాలున్నాయి. ఆలయాలు, ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లే మహిళలు, యువతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

? ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

! ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతంలో వేగ నియంత్రణకు కళ్లెం వేయడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

న్యూస్ బాక్స్

ప్రజలకు నేతల సంక్రాంతి శుభాకాంక్షలు

కందుకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిదులు, వివిధ పార్టీల నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీమంత్రి మాను గుంట మహీధరరెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్ చౌదరి, వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సంక్రాంతిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుశూరి నరసింహరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

ఘనంగా గంధ మహోత్సవం

సంగం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న ఆస్తానా ఏ నూరియా దర్గాలో హజతర్ షేక్ షానూరి సాహెబ్ ఆధ్వర్యంలో శ్రీ హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిష్టి హసన్ సంజరీ రహమతుల్లా అల్లై అజ్మీరి స్వామి గంధ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.